

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

● నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ) : నగరంలోని లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాలను అప్రమత్తం చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. శనివారం రాత్రి కార్పొరేషన్ యంత్రాంగంతో కలిసి ఆయన లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. విపత్తు ఎలా వచ్చిన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. డ్రైన్లలో పూడికతీసి నీళ్లు సులువుగా బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని, ఎక్కడెక్కడ వరద ప్రభావం ఉంటుందో అక్కడ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అండర్ బ్రిడ్జీల వద్ద నీరు నిలబడకుండా చూడాలన్నారు.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం

మండలం	వర్షపాతం (మి.మీ)
కందుకూరు	14.6
ఇందుకూరుపేట	13.4
దగదర్తి	12.4
ఉలవపాడు	12.2
సీతారామపురం	12.2
ఉదయగిరి	10.2
కొండాపురం	10.2
వెంకటాచలం	9.4
కావలి	9.2
లింగసముద్రం	8.6
జలదంకి	8.4
వలేటివారిపాళెం	8.4
టీపీ గూడూరు	7.8
గుడ్లూరు	7.4
అల్లూరు	6.4
విడవలూరు	6.4
పొదలకూరు	6.2
బోగోలు	6.2
కోవూరు	6.0
ముత్తుకూరు	5.6
కొడవలూరు	5.4
సైదాపురం	5.4
కలువాయి	5.4
మర్రిపాడు	5.2
వింజమూరు	5.2
నెల్లూరు రూరల్	4.6
ఆత్మకూరు	4.6
నెల్లూరు అర్బన్	4.2
కలిగిరి	4.2
బుచ్చిరెడ్డిపాళెం	4.2
సంగం	4.0
మనుబోలు	3.6
రాపూరు	2.4
వరికుంటపాడు	2.4
అనుమసముద్రంపేట	2.2
అనంతసాగరం	1.8
దుత్తలూరు	1.4
చేజర్ల	1.2

అలెర్ట్!



శనివారం సాయంత్రం నెల్లూరు నగరాన్ని కమ్మేసిన మబ్బులు

● బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం ● జిల్లా అంతటా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు ● అధికార యంత్రాంగం అప్రమత్తం



కందుకూరులో కురుస్తున్న వర్షం

నెల్లూరు (హరనాథపురం): బంగాళాఖాతంలో ఏర్పాడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో శనివారం తెల్లవారుజాము నుంచి జిల్లా అంతటా వర్షం కురిసింది. ఆదివారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్త మైంది. శనివారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లమీద నీళ్లు నిలిచాయి. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో నీరు ముందుకు కదలక రోడ్లపై చేరాయి. చాలా ప్రాంతాల్లో మురుగునీటి దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తం మీద ఈ వర్షంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. ప్రతి రోజూ 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుండగా, శనివారం 28 డిగ్రీలకు పడిపోయింది. కాగా, జిల్లా వ్యాప్తంగా శనివారం సగటు వర్ష పాతం 6.5 మి.మీగా నమోదైంది.

● **పంటలకు మేలు**

కందుకూరు : వాయుగుండం ప్రభావంతో కందుకూరు ప్రాం తంలో శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పైర్లకు ఈ వర్షం జీవం పోయడమేగాక నెల రోజుల క్రితం విస్తా రంగా వేసిన జామాయిలుకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక మిరప, పొగ నారు మడుల సాగుకు కూడా ఎంతో అనుకూలి స్తుందని, భూములు పూర్తి స్థాయిలో పదును కావడంతో జామా యిలు, పండ్ల తోటలు విస్తారంగా నాట్లు వేసేందుకు అనుకూల వాతా వరణం నెలకొందని భావిస్తున్నారు. మరోవైపు పారిశుధ్య పరి స్థితులు అధ్వానంగా మారాయి. రోడ్లు కూడా అధ్వానంగా మారాయి. గ్రామీణ లింకు రోడ్లు, గ్రావెల్ రోడ్లలో బురదగా మారడంతో వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు సైతం గుంత లమయంగా మారి ఉండ టంతో ఆ గుంతల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



నెల్లూరు : వర్షంలో ద్విచక్ర వాహనదారుడి ప్రయాణం

అప్రమత్తంగా ఉండండి

● 3వ తేదీ వరకు వర్షాలు

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

నెల్లూరు (హరనాథపురం) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు విప త్తుల నిర్వహణ సంస్థ సెప్టెంబరు 3వ తేదీ వరకు భారీ వర్షాల కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాల వల్ల ఎక్కడైన సమస్యలు తలెత్తితే తక్షణ సాయం కోసం ప్రజలు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నెంబరు 0861-233 1261, 1077కు కాల్ చేయాలని కోరారు. ఈ కంట్రోల్ రూముకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా సిబ్బందికి విధులు కేటాయించామని తెలిపారు. జిల్లా అధికారులు కూడా తమ కార్యాలయాల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని వర్షాల వల్ల పంటలు, ఇతర నష్టాలు సంభవిస్తే ప్రతి రోజు తనకు నివేదకలు పంపాలని ఆదేశించారు.

● **విద్యుత్ శాఖలో సెలవుల రద్దు**

నెల్లూరు (జడ్పీ) : తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖ కంట్రోలు రూమ్‌లను ఏర్పాటు చేసింది. ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజరు ఆదిశేషయ్యను నెల్లూరు ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన శనివారం నెల్లూరుకు చేరుకుని అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని 7డివిజన్లలో కంట్రోలు రూమ్‌లను ఏర్పాటు చేయించారు. గూడూరు డివిజన్‌కు 7901036852, నెల్లూరు రూరల్ డివిజన్‌కు 9381815083, నెల్లూరు టౌన్ డివిజన్‌కు 7901642857, కోవూరు డివిజన్‌కు 832808 2583, కావలి డివిజన్‌కు 7901056437, ఆత్మకూరు డివిజన్‌కు 7901056906, నాయుడుపేట డివిజన్‌కు 7382623178 టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయడంతోపాటు అదనంగా విద్యుత్ భవన్‌లో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 9440817468 నెంబర్‌ను కేటాయించారు. అలాగే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సెలవులను రద్దు చేసి, అందరూ హెడ్‌క్వార్టర్లలోనే ఉండాలని సూచించారు.

రూ.18.9 కోట్లతో వేదగిరికి 'ప్రసాదం'

● నరసింహకొండకు పర్యటక హంగులపై కలెక్టర్ ఆరా

● ఆలయం వద్ద అధికారులతో సమీక్ష

నెల్లూరురూరల్, ఆగస్టు 31 : ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రసాదం పథకం వేదగిరి క్షేత్రానికి దక్కనున్నది. ఈ మేరకు కలెక్టర్ ఓ ఆనంద్ పర్యటక అధికారులతో కలిసి శనివారం నరసింహకొండ పరిసరాల్లో ఏర్పాట్లు, నిర్మించబోయే పనులపై స్వయంగా పరిశీలించారు. ప్రసాదం స్కీం కింద తొలుత రూ.18.90 కోట్లు మంజూరు కానున్నాయని తెలిపారు. వీటితో ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టాలన్నది ఆలయ అధికారులు, పర్యటక శాఖ బృందంతో కలిసి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో రాగిపూత, శ్లాబు నిర్మాణాలు, అన్నదాన సత్రం విస్తరణ, భక్తుల విశ్రాంతి హాలు, టికెట్ కౌంటర్, క్లాకరూం, క్యూలైన్లు, పార్కింగ్, విగ్రహాల వద్ద పార్కుల నిర్మాణం వంటి పనులు పూర్తి చేస్తే వేదగిరి క్షేత్రానికి ఆకర్షణ వస్తుందని, తద్వారా భక్తులకు ఆహ్లాదం, ఆధ్యాత్మిక భావన కలుగుతుందన్నారు. మరిన్ని పనులను అందరితో చర్చించి పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు ఆలయంలోకి స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల సన్నిధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అక్రమ నిర్మాణాలపై స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు షఫీమాలిక్


అక్రమ కట్టడాలు ఆపేయండి!

● ఆక్రమిస్తే కఠిన చర్యలు : తహసీల్దారు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతాన్ని నగర తహసీల్దారు షఫీ మాలిక్ శనివారం పరిశీలించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రభుత్వ స్థలమేగా చేసేయ్ కబ్జా' అన్న కథనానికి ఆయన స్పందించి వెంకటేశ్వరపురం పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ వద్ద ప్రభుత్వ భూములను పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలకు త్వరలో నోటీసులు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'సోమశిల'కు జలకళ.. రైతుల కళ్లలో ఆనందం

● నెల వ్యవధిలో 26 టీఎంసీల నీరు చేరిక



అనంతసాగరం, ఆగస్టు 31 : ఎగువ నుంచి వస్తున్న కృష్ణా జలాలతో సోమశిల జలాశయం కొత్త శోభ సంతరించుకొంది. జూలై 27న శ్రీశైలం జలాశయం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి బనకచర్లకు నీటిని విడుదల చేశారు. అక్కడ నుంచి తెలుగు గంగ ద్వారా కొనసాగిన వరద ఆగస్టు 2 నాటికి సోమశిలకు చేరింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా క్రమేణా పెరుగుతూ.. తగ్గుతూ కృష్ణా జలాల ప్రవాహం కొనసాగుతోంది. వరద రాక ముందు సోమశిలలో 9.893 టీఎంసీల నీటిమట్టం ఉండగా శనివారానికి 35.888 టీఎంసీలకు చేరుకొంది. అంటే నెల రోజుల వ్యవధిలో 26 టీఎంసీల నీరు లబ్ధి చేకూరింది. దీంతో జిల్లా రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. వస్తున్న ప్రవాహంలో దిగువ కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000, పవర్ టెన్నల్ ద్వారా డెల్టాకు 550, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నేర పరిశోధనలో, నేరస్థులను గుర్తించడంలో అత్యంత కీలకమైన సీసీ కెమెరాలు జిల్లాలో కునుకు తీస్తున్నాయి. నేర నియంత్రణలో సాంకేతికతను విస్తృతం చేసేదిశగా 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రజా ధనంతో కొన్ని.. దాతల దాతృత్వంతో కొన్ని కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే, గత వైసీపీ సర్కారు పట్టించుకోకపోవడం, పోలీస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్వహణలోపంతో స్తంభాలపై దిష్టిబొమ్మల్లా వేలాడుతున్నాయి.



నెల్లూరు : స్టోన్‌హౌస్‌పేట కూడలిలో నిరుపయోగంగా..



ఆత్మకూరులో దిష్టిబొమ్మలా..

నిఘా కళ్లకు

నిద్ర మత్తు!

నేర పరిశోధన కోసం 2014-19 మధ్య సీసీ కెమెరాల ఏర్పాటు

అప్పటి టీడీపీ ప్రభుత్వం, దాతల చొరవ

ఆ తర్వాత గాలికొదిలేసిన వైసీపీ సర్కారు

నిధుల లేమితో పోలీస్ అధికారుల నిర్లక్ష్యం

దిష్టిబొమ్మల్లా వేలాడుతున్న నిఘా నేత్రాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : 2014-19 మధ్య కాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నేర నియంత్రణలో సాంకేతికతను విస్తృతం చేసే క్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాల అమరికను ప్రోత్సహించింది. అన్ని పట్టణాలు, ప్రధాన రహదారులను కలిపే గ్రామీణ ప్రాంతాలను ఎంపిక చేసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతలను మ్యాట్రిక్ సంస్థకు అప్పగించింది. వీటితోపాటు దాతల విరాళాలతో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ అనుసంధానం చేస్తూ జిల్లా పోలీసు కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో 427 కెమెరాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణను మ్యాట్రిక్ సంస్థకు అప్పగించింది. ఇక దాతల సహకారంతో 500 కెమెరాలను ఏర్పాటు చేసి, నిర్వహణ బాధ్యతను స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి అప్పగించారు.

● **'మ్యాట్రిక్' మొక్కుబడే!**

ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన 427 కెమెరాల నిర్వహణను మ్యాట్రిక్ సంస్థకు అప్పగించినా కారణాలేమోగానీ మూడేళ్లుగా పట్టించుకోలేదు. పాడైన వాటినీ బాగు చేయడం లేదు. నెల్లూరులోనే 350 వరకు మ్యాట్రిక్ కెమెరాలు అమర్చగా 30 శాతం కూడా పని చేయడం లేదు. ఆత్మకూరు బస్టాండు, రైల్వేస్టేషన్, స్టోన్‌హౌస్‌పేట వంటి ముఖ్యమైన కూడళ్లలో కెమెరాలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. ఇక కావలిలో మానస థియేటర్, బంగారపు కొట్ల బజారు, వెంకటేశ్వర థియేటర్, రామిశెట్టి మిల్లు, జెండా సెట్ సెంటర్, రైల్వేస్టేషన్ సెంటర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్.. ఇలా ముఖ్యమైన కూడళ్లలో 30కిపైగా కెమెరాలు అమర్చినా ఒక్కటీ పని చేయడం లేదు.

● **నిరుపయోగమైన దాతల సాయం**

దాతల ఆర్థిక సాయంతో జిల్లావ్యాప్తంగా 500లకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ఇవన్నీ మూడేళ్లకు ముందే మూలనపడ్డాయి. ఉన్నతాధికారుల మెప్పు కోసం దాతలపై ఒత్తిడి తెచ్చి కెమెరాలు ఏర్పాటు చేయడంలో చూపిన శ్రద్ధ వాటి నిర్వహణలో చూపలేదు. వీటి నిర్వహణ బాధ్యతను సర్కిల్ పోలీసు కార్యాలయం చూసుకోవాలి. కానీ ఆ కార్యాలయ అధికారులు నిధుల కొరత పేరుతో సీసీ కెమెరాలను గాలికి వదిలేశారు.

● **కమాండ్ తప్పిన కంట్రోల్ రూమ్స్!**

డివిజన్ల వారీగా సీసీ కెమెరాలను అనుసంధానం చేస్తూ నిరంతరం పర్యవేక్షణ కోసం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మ్యాట్రిక్ కెమెరాలను అనుసంధానం చేశారు. అయితే కెమెరాలే పని చేయకపోవడంతో కమాండ్ కంట్రోల్ రూంలు నిరుపయోగంగా మారాయి. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూం పరిధిలో 427 మ్యాట్రిక్ కెమెరాలతో పాటు దాతల సాయంతో అమర్చిన 500 కెమెరాలు అనుసంధానం చేశారు. అయితే ప్రస్తుతం వీటిలో 30 శాతం కూడా పని చేయడం లేదని సమాచారం.

● కావలి పట్టణంలో ఏర్పాటు చేసిన 30 మ్యాట్రిక్ కెమెరాలతోపాటు దాతల విరాళంతో అమర్చిన 40 కెమెరాలను అనుసంధానం చేస్తూ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అయితే వీటిలో ఒక్క కెమెరా కూడా పనిచేయకపోవడంతో రెండేళ్ల క్రితమే ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ మూతపడింది. జిల్లావ్యాప్తంగా సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సిస్టమ్స్ కూడా మూలనపడినట్లు సమాచారం. అలాగే ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో 364కు పైబడి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిలో 40 మాత్రమే పని చేస్తున్నట్లు తెలుస్తోంది.



పొదలకూరులో నిరుపయోగంగా..



కావలిలో మూతపడిన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం

● **అంతులేని నిర్లక్ష్యం!?**

నేర పరిశోధనలో సీసీ కెమెరాల వ్యవస్థ అత్యంత కీలకం. ఇప్పటివరకు ట్రేస్ అవుట్ అయిన కేసుల్లో అత్యధిక శాతం సీసీ పుటేజీల పాత్ర కీలకం. నేరారోపణలకు సంబంధించి కోర్టులో కేసులు నిలబడాలన్నా సీసీ పుటేజీలు చాలా ఉపయోగపడతాయి. కీలకమైన సీసీ కెమెరాల వ్యవస్థను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, పోలీసు ఉన్నతాధికారులు ఉదాసీన వైఖరి అవలంభించడం ప్రజల దురదృష్టం. కూటమి ప్రభుత్వమైనా సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్టం చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఒక్క రోజు ముందుగానే

ఎన్టీఆర్ 'భరోసా'!

● 95 శాతం పెన్షన్ల పంపిణీ ● చరిత్ర సృష్టించిన ప్రభుత్వం



పెన్షన్లు పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 29 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని అనుకున్న రోజు కంటే ఒకరోజు ముందే పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. శనివారం తెల్లవారుజాము నుచంచి వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షను సొమ్ము అందజేశారు. సెప్టెంబరు 1న పంపిణీ చేయాల్సిన పింఛన్‌ను ఒకరోజు ముందే అంటే శనివారమే 95 శాతం పంపిణీ చేశారు. అత్యధికంగా కోవూరు, నెల్లూరు, రాపూరు, బుచ్చి, సైదాపురం తదితర ప్రాంతాలలో అందజేశారు. గత ప్రభుత్వంలో ఐదు రోజులపాటు పెన్షన్ల పంపిణీ జరిగేది. వేల సంఖ్యలో వలంటీర్లు ఆ పెన్షన్ల పంపిణీ కోసం పని చేశారు. వలంటీర్లు లేకపోతే ఏ పని చేయలేరని వైసీపీ పెద్దలు పేర్కొనేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వలంటీర్లు లేకుండానే ప్రభుత్వ సిబ్బంది ద్వారా ఈ ప్రక్రియను దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారు. జిల్లాలో 3.12 లక్షల లబ్ధిదారులకు రూ.132.30 కోట్ల పెన్షన్ సొమ్ము విడుదలైంది. 768 సచివాలయాల పరిధిలో శనివారం ఉదయం నుంచే పంపిణీ చేశారు. ఈ రోజు నగదు తీసుకోని వారికి సోమవారం నగదు అందజేయనున్నారు.



లబ్ధిదారుడికి పింఛను సొమ్ము ఇస్తున్న కలెక్టర్ ఆనంద్

● శనివారం తెల్లవారుజామునే వర్షంలోనే రాష్ట్ర మంత్రి నారాయణ నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో లబ్ధిదారులకు పెన్షన్ అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు. అలాగే కలెక్టర్ ఆనంద్ నెల్లూరు నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేశారు.

నుడా వీసి బాపిరెడ్డి బదిలీ

నెల్లూరు (జడ్పీ) : నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) వీసీ బాపిరెడ్డిని బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మాతృ శాఖ అయిన రెవెన్యూ శాఖలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. నుడా ఇన్‌చార్జి బాధ్యతలను కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజకు అప్పగిస్తూ జీవో జారీ అయ్యింది. కాగా, వీసీ బాపిరెడ్డి శనివారమే రిలీవ్ అయ్యారు.

● **కార్పొరేషన్ కార్యదర్శిగా..**

నెల్లూరు(సిటీ) : నెల్లూరు కార్పొరేషన్‌లోని సెక్రటరీగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫాజుల్లాను నియమిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన్ను రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించినా శనివారం జారీ అయిన ఉత్తర్వుల్లో నెల్లూరు సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘల్ పేర్కొన్నారు. ఓన్ పే పైన ఆయన ఇక్కడ పని చేయనున్నారు.

పొట్ట కూటి కోసం వెళ్లి జీవచ్ఛవంలా ఇంటిముఖం

● 15 నెలలపాటు నరకయాతన ● రూ. 1.6 లక్షలు చెల్లించి ఇంటిదారి

భర్త అనారోగ్యంతో మంచం పట్టాడు.. దీంతో పూటగడవడం కష్టంగా మారింది.. పెళ్లీడుకు వచ్చిన ఇద్దరు ఆడపిల్లలు... అలాంటి దీనస్థితిలో కుటుంబాన్ని పోషించుకోవాలని ఓ మహిళ బతుకుదెరువు కోసం ఒమెన్ దేశానికి వెళ్లింది. అక్కడ 15నెలలపాటు నరకయాతన అనుభవించింది. చివరికి రూ. 1.60 లక్షలు చెల్లించి జీవచ్ఛవంలా ఇల్లు చేరింది. ఏఎస్ పేటకు చెందిన బీబీజాన్ ఒమెన్‌లో పడిన కష్టాలు ఆమె మాటల్లోనే విందాం.

- ఏఎస్‌పేట


అనారోగ్యంతో మంచం పట్టిన బీబీజాన్

మాకు ముగ్గురు పిల్లలు. అందులో పెళ్లీడుకు వచ్చిన ఇద్దరు ఆడ పిల్లలు. ఆరో తరగతి చదివే కుమారుడు ఉన్నాడు. మా ఆయనకు రెండేళ్ల క్రితం కాళ్లలో నరాలు దెబ్బతిని మంచం పట్టాడు.దీంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. ఈ స్థితిలో ఆత్మకూరుకు చెందిన ముజీబ్ ఒమెన్ దేశంలో పని కోసం నన్ను పంపిస్తానని, నెలకు మంచి జీతం వస్తుందని చెప్పాడు. గత ఏడాది మే 13న ఒమెన్‌కు వెళ్లా. అక్కడ కుమార్ అనే వ్యక్తి వచ్చి వాళ్ల ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటి నుంచి అతను నన్ను ఇబ్బంది పెట్టేవాడు. మూడు రోజులు తన రూములో ఉంచుకుని, సతాయించి నాలుగోరోజు ఓ అరబ్‌సేట్ దగ్గర రూ.లక్ష తీసుకుని నన్ను ఆయనతో పంపించాడు. ఆయన నన్ను నానా ఇబ్బందులు పెట్టాడు.కుమార్‌కి చెబితే మూడు నెలల తరువాత తీసుకువచ్చి తన రూమ్‌లో ఉంచుకుని నరకం చూపించాడు. కొన్ని రోజుల తరువాత మళ్లీ రూ. 2.80 లక్షలు తీసుకుని మరో అరబ్‌సేట్ ఇంటికి పంపాడు.

● **బతికి వస్తానని అనుకోలేదు..**

అక్కడ ఆ అరబ్‌సేట్‌కి పనేమిలేదు. ఇంట్లోనే ఉంటాడు. ఎప్పుడూ తాగడం, ఏవేవో సూదులు వేసుకుంటూ ఉండేవాడు. నన్ను చిత్రహింసలు పెట్టేవాడు. ఏది దొరికితే అది తీసుకుని కొట్టేవాడు. చెప్పిన మాట వినకపోతే అన్నం పెట్టేవాడుకాదు. బాధలు భరించలేక ఇంటికి పంపమని కుమార్‌కి ఫోన్ చేసి ఏడ్చేశా. నా దగ్గర కుమార్ రూ. 2.80లక్షలు తిన్నాడు. చివరకు మా ఆయనకు ఎలాగో ఫోన్ చేశా. మా ఆయన అప్పులు చేసి రూ.1.60లక్షలు ముజీబ్‌కి ఇచ్చాడు. గత జూలై 19న అతను నన్ను ఇండియాకు తీసుకువచ్చాడు. 15 నెలల తరువాత ఎండ చూశా.మళ్లీ ప్రాణాలతో తిరిగి వస్తానని అనుకోలేదు. ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కావడంలేదు.డబ్బులు సంపాదించి కుటుంబాన్ని పోషించాలని ఒమెన్ దేశానికి వెళ్లి అనారోగ్యంతో అప్పుల పాలై తిరిగి వచ్చా. నాకు న్యాయం చేసి, కుటుంబాన్ని ఆదుకోండి' అంటూ బీబీజాన్ కన్నీటి పర్యంతమైంది.

అసలు.. ఎవరు నకిలీ!

● సహకార సంఘాల సభ్యత్వాల ప్రక్షాళన
● గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు
● ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు

సహకార సంఘాలకు వీలైనంత త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం సమాయత్తం అవుతోంది. తొలీగా సంఘాల్లో ఉన్న సభ్యత్వాలను ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం థర్డ్ పార్టీ వెరిఫికేషన్ కోసం ఆదేశాల వెలువడ్డాయి. సంఘాల్లోని సభ్యుల జాబితాలను ఆయా ఎంపీడీవోలకు అందజేసి, గ్రామాల వారీగా సచివాలయ ఉద్యోగుల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. దీంతో ఆయా సంఘాల్లో ఉన్న సభ్యులెంత మందో తేలిపోతుంది. దీనికితోడు ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కేంద్రం కూడా కార్యాచరణకు పూనుకుంది. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఒక పోర్టల్‌ను రూపొందించి నిజమైన సభ్యుల వివరాలను పూర్తిగా క్రోడీకరించి ఈ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. వాస్తవ సభ్యులతో ఎన్నికలు జరిపేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సంగం, ఆగస్టు 31 : జిల్లాల విభజన జరిగినా సహకార సంఘాల పాలనా వ్యవహారాలన్నీ ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే జరుగుతున్నాయి. ఆ లెక్కన ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 99 సంఘాలు ఉండగా, వీటి వ్యవహారాలన్నీ నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆజమాయిషీలోనే నడుస్తున్నాయి. విభజన జిల్లాలో 78 సంఘాలు, 74,392 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. అయితే ఏ సంఘంలోనూ సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో లేవు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించడంతో బోగస్ సభ్యత్వాలను తొలగించి ప్రక్షాళన చేయడానికి సమాయత్తమయ్యారు.


ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం



● **ఈకేవైసీ చేయించుకోవాలని ప్రకటన**

సంఘాలలోని సభ్యుల వివరాలను సేకరించే పనిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపీడీవోలకు అప్పగించింది. సభ్యుల జాబితాలను ఎంపీడీవోలకు పంపి సచివాలయ ఉద్యోగుల ద్వారా వారం రోజులుగా వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు.

● **11 ఏళ్ల క్రితం ఎన్నికలు**

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు ఉమ్మడి రాష్ట్రంలో 2013, ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 2018లో నిర్వహించాల్సి ఉన్నా కొద్దినెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా అవి వాయిదా పడ్డాయి. దీంతో టీడీపీ ప్రభుత్వం అధికారులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. అనంతరం వైసీపీ పాలనలో త్రీమెన్ కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించి కొనసాగించారు ఈ కమిటీల నియామక గడువును ప్రతి ఆరు నెలలకోసారి పొడిగిస్తూ నెట్టుకొచ్చారు.

అయితే, జాబితాలో సగానికి సగం మంది సభ్యుల వివరాలు దొరకడం లేదని చెబుతున్నారు. చాలాకాలం క్రితమే చనిపోయిన వారు కూడా సభ్యులుగా కొనసాగుతున్నట్లు గుర్తించారు. రైతులకు సంబంధించిన భూముల విరాలు కూడా నమోదు కాలేదు. ఆధార్ నెంబర్లు కూడా దొరకడం లేదని క్షేత్రస్థాయిలో గుర్తించారు. పాసు పుస్తకాల ఖాతా నెంబర్లు లేకపోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. ఖాతా నెంబర్లు కూడా తెలియకుండా ఎలా రుణాలు మంజూరు చేశారో అర్థం కావడం లేదని విస్తుపోతున్నారు. అసలు సంఘాల్లో రుణాలు తీసుకోనివారు, తీసుకున్న వారి వివరాలు స్పష్టంగా లేనట్టు తెలుస్తోంది. దీంతో సహకార సంఘాల్లో సభ్యత్వాలు ఉన్న రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలతో 15 రోజుల్లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని, లేకుంటే సభ్యత్వాలను తొలగిస్తామని ఆయా సంఘాల సీఈవోలు స్పష్టం చేస్తున్నారు.

● **ఎన్నికల కోసం ఎడాపెడా సభ్యతాలు**

గతంలో సహకార సంఘాల ఎన్నికల సమయంలో గడువు ముగిసేనాటికి రెండు మూడు రోజుల ముందు ఎడాపెడా సభ్యత్వాలను నమోదు చేయడమే ఈ గందరగోళానికి కారణంగా తెలుస్తోంది. సింగిల్ విండోల అధ్యక్ష పదవులను ఆశించే వారు సభ్యుల తరఫున తామే రూ.350 వంతున సభ్యత్వ రుసుం చెల్లించడం ఈ అనర్థానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.

● **మళ్లీ టీడీపీ అధికారంలోకి..**

తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో త్రీమెన్ కమిటీలు రాజీనామా చేయడంతో తిరిగి ప్రభుత్వం అధికారులను ఇన్‌చార్జులుగా నియమించింది. ప్రస్తుతం సొసైటీల్లో సభ్యత్వాల ప్రక్షాళన జరుగుతుండటంతో త్వరలో సింగిల్ విండోలకు ఎన్నికలు రావొచ్చనే సంకేతాలున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు, జిల్లా పరిషత్తులకు మరో రెండున్నరేళ్ల తరువాత గానీ ఎన్నికలు వచ్చే అవకాశం లేదు. ఈలోగా సహకార ఎన్నికలు, నీటి సంఘాల ఎన్నికలు త్వరత్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నట్టు సమాచారం.

మేధోసంపత్తి దిశగా రేడియాలజీ సదస్సు

● రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన వైద్యులు, కంపెనీలు
● వ్యాధులు, నిర్ధారణ పరీక్షలపై విస్తృత చర్చ



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి, వైద్యునిపుణులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 31 : నెల్లూరులో శనివారం జరిగిన 10వ అప్రియ రేడియాలజీ రాష్ట్రస్థాయి సదస్సు మేధోసంపత్తి దిశగా సాగింది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన ఎందరో వైద్యనిపుణులు రేడియాలజీలో వస్తున్న ఆధునిక విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ సదస్సులో పాల్గొన్న 800 మంది రేడియాలజిస్టులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొని ప్రస్తుత వ్యాధుల స్థితిగతులు, నిర్ధారణ పరీక్షలపై చర్చిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యులు శ్యామ్‌సందర్ (కడప), శేషలక్ష్మి (మంగళగిరి), సురేష్ (కర్నూలు), పడవల సతీష్ (విజయవాడ), ప్రమోద్ (రాజమండ్రి), సరళ (తిరుపతి)లు రేడియాలజీలో వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ చాప్టర్ ఆఫ్ ఇరా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వరప్రసాద్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణబాబు, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కిశోర్‌కుమార్, వైద్యులు సురేంద్రకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● **వ్యాధుల నిర్ధారణలో వీరే కీలకం**

ఈ సదస్సులో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ వ్యాధుల నిర్ధారణలో రేడియాలజిస్టుల పాత్రం కీలకమన్నారు. గతంలో తనకు శస్త్రచికిత్స చేయాల్సిన పరిస్థితిలో రేడియాలజీ ద్వారా వచ్చిన నివేదిక ఆధారంగా శస్త్రచికిత్స అవసరం లేకుండా వ్యాధిని తగ్గించుకోగలిగానని గుర్తు చేశారు. 2వ తేదీ నుంచి కేన్సర్ స్కీనింగ్ బస్ ద్వారా కోవూరు నియోజకవర్గంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా వచ్చిన వ్యక్తిని తప్పించబోయి..

● చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు ● పలువురికి గాయాలు


ప్రమాదంలో ముందు భాగం దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

కలువాయి, ఆగస్టు 31: రోడ్డుకు అడ్డంగా వచ్చిన వ్యక్తిని తప్పించబోయి ఆర్టీసీ బస్సు ప్రక్క నున్న చెట్టును ఢీకొన్న సంఘటన శనివారం మండలంలోని వెరుబొట్ల పల్లి రోడ్డు వద్ద చోటుచేసుకుంది. వివరాలు మేరకు.. బస్సు కలువాయి నుంచి నెల్లూరుకు వెళుతోంది. వెరుబొట్ల పల్లి రోడ్డు వద్ద బస్సు ఎక్కేందుకు ఒక వ్యక్తి రోడ్డుకు అడ్డంగా వచ్చాడు. గమనించిన డ్రైవర్ అతన్ని తప్పించే క్రమంలో ప్రమాదంకు గురై బస్సు ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమా దంలో రోడ్డుకు అడ్డంగా వచ్చిన వ్యక్తితో పాటు బస్సులో ఉన్న పలువురు గాయపడ్డారు. వారిని 108లో నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెన్నానది రేవులోకి పడవ

● డ్రెడ్జింగ్ విధానంలో ఇసుకను తీసేందుకు సన్నాహాలు


పెన్నానదిలో ఇసుక తీసేందుకు తీసుకు వచ్చిన పడవను ట్రాలీలో నుంచి కిందకు దించుచున్న క్రేన్‌లు

సంగం, ఆగస్టు 31: పెన్నానదిలో డీసిల్టేషన్‌ను డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తీసేందుకు శనివారం అధి కారులు సన్నాహాలు ప్రారంభించారు. ఆ మేరకు ట్రాలీలో వచ్చిన పడవను నాలుగు క్రేన్‌ల సహాయం తో కిందకు దించి పెన్నానదిలో ఏర్పాటు చేసిన రేవులోకి వదిలారు. నదిలో యంత్రాలు వినియోగించి ఇసుక తీసేందుకు పర్యావరణ అనుమతులు రాకపోవడంతో పర్యావరణానికి ఆటంకం లేకుండా నూతనంగా డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తీసేందకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా మైనింగ్, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా నదుల్లో డీసిల్టేషన్‌లో ఇసుకను తీసేందుకు డ్రెడ్జింగ్ విధానం అనువుగా ఉండడంతో చర్యలు చేపట్టారు. ఆదివారం నుంచి ఇసుక తీసేందుకు పనులు ప్రారంభించనున్నారు. ఆ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి తీసిన ఇసుకను అధికారులు గుర్తించి నిల్వ కేంద్రానికి ట్రాక్టర్లతో తరలిస్తా రని చెప్పారు. త్వరలో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు ఇసుక విక్రయించనున్నట్లు మైనింగ్ జిల్లా అధికారి శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	102
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6896
వెండి కిలో ధర	రూ. 86,000
వెండి ఒక గ్రాము	రూ. 89.00

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేయండి

● వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ నేర సమీక్ష


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 31: శాంతిభ ద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్ష నిర్వ హించారు. జిల్లాలో చోటు చేసుకుంటున్న పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాల్లో విచారణ గురించి సర్కిల్ వారీగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పల్లె నిద్ర, గ్రామాల సంరక్షణ, గ్రామాల్లోని సమస్యలు, ఆస్తి నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలు, బాలబాలికలపై జరిగే అఘాయిత్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోక్సో కేసులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాల న్నారు. సెప్టెంబరు 14న జరగనున్న నేషనల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వి నియోగం చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. గస్తీలు పటిష్టంగా అమలు పర చాలని, వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానిత వ్యక్తులపై దృష్టి సారిం చాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, జైలు నుంచి విడుదలైన వారిపై ప్రత్యేక నిఘా ఉం చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో రాయితీపై దంత వైద్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), ఆగ స్టు 31 : నారాయణ దంత వైద్య శాలలో రాయితీపై ఆధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ పేర్కొన్నారు. శనివారం ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబరు 2 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు చిన్నపిల్లల దంత సంరక్షణకు పాఠశాలల్లో 150కి పైగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దంత వైద్యశాల కో ఆర్డినేటర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రూ.15వేల ఖరీదైన తీసిపెట్టుకునే పళ్లకు కేవలం రూ.వెయ్యి, రూ.40వేలు విలువ చేసే డెంటల్ ఇంప్లాంట్‌కు రూ.9 వేలు వసూలు చేస్తున్నామని చెప్పారు. అవసరమైనవారు 7331170047, 7780473823 ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు. అనంతరం రాయితీతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దిలీప్ నాగ్, వంశీకృష్ణారెడ్డి, ఏజీఎం భాస్కర్‌రెడ్డి, శరణ్‌బాబు, అరవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద ఆలయ భూముల పరిశీలన


భూములు పరిశీలిస్తున్న అధికారులు

వరికుంటపాడు, ఆగస్టు 31: వేంపాడు రెవెన్యూలోని సర్వే నంబరులో 78-1లోని 6.08ఎకరాల వివాదాస్పదంగా మారిన ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన మదన వేణుగోపాల స్వామి ఆలయ భూములను శనివారం దేవాదాయ శాఖ డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లు మహే శ్వరరెడ్డి, జనార్దనరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డిలు పరిశీలించారు. ఇటీవల ఈ భూమిని కొంతమంది ఆక్రమించుకొని సాగుకు పూనుకున్నారన్న విషయంపై రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. దీంతో ఆక్రమ ణకు పూనుకొన్న వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ అధికారులు అక్కడికి చేరుకొని భూములతో సహా రికార్డులను సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లు కాకుండా చూడటంతో పాటు పాటు సమగ్ర నివేదికలను కోర్టుకు సమర్పించి ఆక్రమణదారుల నుంచి భూములను స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆలయ ఈవో నరసింహబాబుకు ఆదేశించారు. ఎవరైనా సరే నిబంధనలకు విరుద్ధంగా ఆలయ భూముల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

● గంజాయి పొట్లాలు, టాబ్లెట్లు, సిరంజ్‌ల స్వాధీనం

కావలి రూరల్, ఆగస్టు31: స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని జడ్పీ హైస్కూల్ మైదానం వద్ద గంజాయి పొట్లాలు అమ్ముతున్నారన్న సమాచారంతో శనివారం సాయంత్రం ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి అమ్ముతున్న పాతూరుకు చెందిన మద్రి వినయ్‌కుమార్, ఉమ్మడిప్రోలు సాయితేజను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి వంద గ్రాముల గంజాయి ప్యాకెట్లు రెండు, ట్రైడోల్ 100ఎంజీ టాబ్లెట్లు నాలుగు షీట్లు, ఎనిమిది సిరంజ్‌లు, డిస్టిల్ వాటర్ బాటిళ్లు ఎనిమిదింటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు యువకులు ఇంజనీరింగ్, డిగ్రీ డిస్‌కంటిన్యూ అయి చెడు వ్యసనాలకు బానిసలుగా మారారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కనుల పండువగా నరసింహుడి కల్యాణం


కల్యాణంను నిర్వహిస్తున్న వేదపండితులు

రాపూరు, ఆగస్టు 31: పెంచలకోన క్షేత్రంలో వెలసిన చెంచులక్ష్మీ.. ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామికి శనివారం ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. అంతకుముందు ఉదయం 4 గంటలకు అభిషేకం, ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. కన్నులపండువగా సాగిన కల్యాణ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకుని మొక్కులు చెల్లిం చుకున్నారు. ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కేవీ సాగర్ బాబు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

● అక్రమంగా విద్యుత్ కంచె ● మూగజీవాల బలి

పొదలకూరు, ఆగస్టు 31 : మండలంలోని నందివాయి, అమ్మవారిపాలెం, మరువూరు, పీజీపట్నం అటవీ ప్రాంతాలలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా కొనసాగుతోందని, అక్రమా ర్కులు ఏర్పాటు చేస్తున్న అక్రమ విద్యుత్ తీగలకు మూగజీవాలు బలవుతున్నాయని రైతులు, పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈతంతు గత కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల నందివాయి గ్రామానికి చెందిన బర్రె రోజులాగే అడవిలోకి మేతకెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అడవి మొత్తం గాలింపు చర్యలు చేపడితే ఓప్రాంతంలో అక్రమార్కులు పెట్టిన విద్యుత్ తీగ లకు తగిలి మృత్యువాత పడిందని బాధితుడు వెంకయ్య వాపోయాడు. బర్రెను ఇటీవలే రూ. లక్షకు కొనుగోలు చేసినట్లు ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. ఈ కరెంటు తీగలకు గతంలో ఓ మనిషి కూడా ప్రాణాలు కోల్పోయాడని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని మూగజీవాలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కావలి డిపోలో కార్మిక పరిషత్ ఆవిర్భావం

● నూతన కార్యవర్గం ఎంపిక


కార్మిక పరిషత్ నూతన కమిటీ బాధ్యులతో పరిషత్ రాష్ట్ర నాయకులు

కావలి, ఆగస్టు31: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం కార్మిక పరిషత్ ఆవిర్భవించింది. ఆ పరిషత్ రాష్ట్ర నాయకులు కార్మికులతో సమావేశమై నూతన కమిటీని ఎంపిక చేశారు. అనంతరం వారిని డీఎం రాపూరు శ్రీనివాసులుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ బలోపేతానికి టీడీపీ, చంద్రబాబు అభిమానులైన టీఎన్‌టీయూసీ సభ్యులు అనుబంధ కార్మికపరిషత్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయలేదని, కార్మికులకు ఇవ్వాల్సిన భత్యాలను ఇవ్వలేదని, పరోక్షంగా ఆర్టీసీని నిర్వీర్యం చేశారన్నారు. ఆర్టీసీ మనుగడను, కార్మికుల హక్కులను కాపాడుకోవటానికి కార్మిక పరిషత్‌ను బలపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరి రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వై. రాము, ప్రచార కార్యదర్శి వై. రమేష్, కోశాధికారి సురేంద్ర, నెల్లూరు రీజియన్ ప్రచార కార్యదర్శి కామేశ్వరరావు, కావలి డిపో నాయకులు పరిటాల శేషయ్య, రాంప్రసాద్ పాల్గొన్నారు.

● **నూతన కార్యవర్గం**

కావలి డిపో కార్మిక పరిషత్ సలహాదారుడిగా గురుజాల నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా కేవీ రమణయ్య, కార్యదర్శిగా కే. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా ఎం. హరిబాబు, సహాయ కార్యదర్శిగా సింహాద్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బ్రహ్మారెడ్డితోపాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా సాంబశివారెడ్డి

నెల్లూరు (హరనాథపురం) : ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా, సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీగా డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి నియమితులయ్యారు. ఇంతవరకు వీటికి జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య ఇన్‌చార్జిగా వ్యవహించారు. శనివారం ఆయన పదవీ విరమణ చేయటంతో కలెక్టర్ ఆనంద్ సాంబశివారెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు.

టీడీపీకి టచ్‌లో వైసీపీ నేతలు!

నెల్లూరురూరల్, ఆగస్టు 31 : నెల్లూరురూరల్‌లో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆసక్తి చూపుతున్నారు. అందులో భాగంగా శనివారం రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో పలువురు కార్పొరేటర్లు భేటీ అయ్యారు. తమ రాకకు అనుమతివ్వాలంటూ విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. 17, 18వ డివిజన్ల కార్పొరేటర్లు సుధాకర్, అశోక్, 34వ డివిజన్ కార్పొరేటర్ భర్త రియాజ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు మరికొంతమంది వైసీపీ నాయకులు ఇప్పటికే టచ్‌లో ఉన్నారు. కాగా వైసీపీకి చెందిన కొందరు ప్రజాప్రతిని ధులు, నాయకులు ఆదివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. వైసీపీకి చెందిన కార్పొ రేటర్లు, సర్పంచులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వ్యక్తులు, నాయకులు, కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుండగా వారిలో కొందరిని మాత్రమే ప్రస్తుతం టీడీపీ నాయకుల అనుమతితో తీసుకునేందుకు కోటంరెడ్డి సోదరులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ప్రారంభించకనే శిథిలావస్థకు..

- నిరుయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు
- నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- రూ.లక్షల ప్రభుత్వ ధనం దుర్వినియోగం



అనుమసముద్రంలోని చెత్త సంద తయారీ కేంద్రం

ఏఎస్ పేట, ఆగస్టు 31: గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి వాటి నుండి సేంద్రియ ఎరువులు తయారు చేసి సంపద సృష్టించాలని గత టీడీపీ ప్రభుత్వం చెత్తశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణను పట్టించుకోక పోవడంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కేంద్రాలు చాలావరకు ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరాయి.

మండలంలో 19పంచాయతీల్లో..

ఏఎస్ పేట, అనుమసముద్రం, చౌటభీమవరం దాదాపు అన్ని పంచాయతీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. వర్మీకంపోస్టు తయారీ చేసేందుకు వాన పాములను సైతం తొట్టెలలో ఉత్పత్తి చేసేవారు. వాటి నిర్వహణ పంచాయతీలకు అప్పగించడంతో నిర్వహణ భారమై వాటిని అలాగే వదిలేశారు. అప్పటి నుంచి ఇవి అధ్వానంగా మారాయి. చెత్త పన్ను వసూలు చేయడం నిపివేశారు. దీనితో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కేంద్రాలు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం శిథిలం అవుతున్నాయి.

నిరుపయోగంగా యంత్రాలు..: ఏఎస్ పేటలో చెత్తను వేరు చేసి శుద్ధి చేసేందుకు రూ.లక్షలతో కొనుగోలు చేసి తీసుకొచ్చిన యంత్రాలను విని యోగించకపోవడంతో అవి తుప్పుపట్టి శిథిలమై నిరుఉపయోగంగా మారాయి. చాలా పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ఆకతాయిలకు అడ్డాగా..: చెత్త శుద్ధి కేంద్రాలను గ్రామలకు దూరంగా ఏర్పాటు చేశారు. వాటిని వినియోగించకుండా వదిలేయడంతో అవి ఆకతాయిలకు అడ్డాగా మారాయి. సాయంత్రమైతే మందుబాబులు కేంద్రాలను బార్లుగా వాడుకుంటున్నారు. పలువురు అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరికుంటపాడు: గువ్వాడి గ్రామంలో సుమారు రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీల్లో ఈ కేంద్రాలు నిర్మించారు. అప్పటినుంచి ప్రారంభానికి నోచుకోకుండానే నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో వీటిని పట్టించుకోక పోవడంతో నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి అనుసంధానంగా నిర్మించిన నాడెప్ తొట్టెలు సైతం కంపచెట్లతో నిండిపో యాయి. ప్రజలు తమ నివాసాల నుంచి తీసుకొచ్చిన చెత్తను తొట్టెల్లో నింపకుండా ఖాళీ జాగాల్లోనే దిబ్బలుగా వేస్తున్నారు.


వరికుంటపాడు: నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

ఎడతెరపిలేని ముసురు వర్షం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మెట్టప్రాంతంలో శనివారం ఎడతెరిపిలేని ముసురు వర్షం కురిసింది. చలిగాలులు వీయడంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిల్వ చేరి బురదమయంగా మార డంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ వర్షంతో ఆరుతడి, పండ్ల తోటలకు ఊరట లభించింది.

వరికుంటపాడు: రెండు రోజులుగా వీడకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. శుక్రవారం రాత్రి నుంచి శనివారమంతా అదే రీతిలో వర్షం కమ్ముకోవడంతో ప్రజలు బయటకు వెళ్లలేక నివాసాలకే పరిమితమయ్యారు. ఆశించిన మేర వర్షం కురవకపోవడంతో కాలనీలు చిత్తడిగా మారాయి. చలిగాలుల ప్రభావంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

ఏఎస్‌పేటలో సీఐ

ఏఎస్ పేట, ఆగస్టు 31: స్థానిక హజరత్ ఖాజ రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గాను శనివారం సంగం సీఐ వేమారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం దర్గా పరిసరాలను పరిశీలించారు. ఎస్ఐ సైదులు సిబ్బంది ఉన్నారు.

సంగం: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వేమారెడ్డిని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు తోకల మురళి, కార్యదిర్శి చంద్ర నారాయణస్వామి కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆత్మకూరు, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో మధులత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఏ గ్రామంలోనైనా అత్యవసరమైతే 91009 48215 నెంబరుకు సమాచారం తెలపాలన్నారు.

రేపటి నుంచి ఉపాధి గ్రామసభలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 31: మండలంలో ఉపాధిహామీ పథకం సామాజిక బృందం తనిఖీల్లో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీవో బ్రహ్మయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2న రెడ్లదిన్నె, 3న రాచవారిపల్లి, 4న భైరవరం ఏరుకొల్లు, సోమలరేగడ, వెంగన్నపాళెం, నర్రవాడ, 6న దుత్తలూరు, 7న బండకిందపల్లి, పాపంపల్లి, తెడ్డుపాడు, వెంకటంపేట, కొత్తపేట, బ్రహ్మేశ్వరం, నందిపాడు, 8న బోడవారిపల్లి, తిమ్మాపురంలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 31: స్థానిక దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంత సభ్యులు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి వాహనం వెంట వారుక డవతో నీరుపోసి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, ఆగస్టు 19: మున్సిపాలిటీ పరిధిలోని 2వార్డులో జలదంకి అనురాధ, 22వ వార్డులో రాగి హజరత్తయ్య, మాదాల సుభాషిణి, 23వార్డులోని ఆడిపూడి పోలయ్యలు ఇటీవల మరణించారు. వీరి కుటుంబాలను శనివారం కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

వింజమూరు, ఆగస్టు 31: ఐసీడీసీ కార్యాలయ ఆవరణలో సీడీపీఓ పద్మజకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో ఈ కా ర్యక్రమం చేపడతామన్నారు. ఈ సందర్భంగా రక్తహీనత, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించడం, ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు పిల్లలకు ఇవ్వాల్సిన అనుబంధ పోషక ఆహారం మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఆయిల్‌ఫామ్ రైతులకు సబ్సిడీ అందేలా చూస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, ఆగస్టు 31: ఊటుకూరు పంచాయతీలో శనివారం ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సాగు చేసిన రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీలు అ ందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో వృద్ధులకు పించన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, దంతులూరి వెంకటేశ్వర్లు, గణపం సుదర్శన్‌రెడ్డి, మంచాల శ్రీనివాస్‌నాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం, ఆగస్టు 31: వంగల్లు కామాక్షిదేవి సమేత భీమేశ్వరాలయంలో శనివారం చండీయాగం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం మహాస్నపనం, ధాన్యాధివాసం, పుష్పశయాధివాసములు, ఆదివాస హోమం, మంగళహారతి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ పగడాల రఘురామయ్య, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. భీమేశ్వరాలయంలో జరిగే పునఃప్రతిష్ఠ కుంబాభిషేకానికి ఆదివారం ఉదయం గం.8-30 గంటలకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు డీపీఆర్వో ఎంవీ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వినాయకచవితి ఉత్సవాలకు శ్రీకారం


ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, ఆగస్టు 31: స్థానిక జెఆర్‌పేట ఎక్స్‌టెన్షన్ ఏరియాలో శనివారం ఉదయం గణేష్ భక్తిమండలి సభ్యులు ధ్వజారోహణతో వినాయకచవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 7వ తేదీ నుంచి మూడురోజుల పాటు ఘనంగా ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గణేష్ భక్తిమండలి సభ్యులు రవీంద్రకుమార్, ఓబుల్‌రెడ్డి, సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజ కార్యక్రమాలు, తీర్థప్రసాదాల వితరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుపుతామన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గణేష్ భక్తి మండలి సభ్యులు అయ్యన్న, సీవీరెడ్డి, యస్ శ్రీనివాసులు, పద్మనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 31: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న 202పక్కాగృహాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పండ్లతోటల పెంపకానికి సంబంధించి మండలానికి 200ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 75ఎకరాలకు రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన 125 ఎకరాల లక్ష్యాన్ని ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. మండలానికి మంజూరైన 15నూతన పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేసుకుంటే కూలి

సీతారామపురం: మండలకేంద్రం సమీపంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి పరిశీలించారు. కూలీలు చేస్తున్న పనులు, మస్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి రోజు ఉదయాన్నే 6.30 నుండి 11గంటల వరకు పని చేయాలని, యంత్రాలతో పని చేపిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేటాయించిన పనిని కొలతల ప్రకారం చేసుకుంటే రోజుకు 300రూపాయల వరకు వస్తుం దన్నారు. కూలీలకు పనుల గురించి సూచనలు ఇచ్చారు.

ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలి

ఆత్మకూరు, ఆగస్టు 31: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఆధార్‌కార్డు కలిగి ఉండాలని ఆర్డీవో మధులత తెలిపారు. శనివారం ఆమె మహిమలూరు గ్రామాన్ని సందర్శించి ఆధార్‌కార్డు లేని ఎస్టీ కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. ఆధార్ నమోదుకు అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సుధీర్ బాబు, సర్పంచ్ చంద్రశేఖర్, కార్యదర్శి భాస్కర్, వీఆర్వో ప్రతాప్ పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుండా చేపల వేట సాగిస్తే చర్యలు

అనంతసాగరం, ఆగస్టు 31: సోమశిల జలాశయంలో లైసెన్సు కలిగిన జాలర్లు మాత్రమే చేపల వేట సాగించాలని మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి బయట వ్యక్తులు చేపల వేటకు వెళితే చర్యలు తప్పవని హెచ్చ రించారు. నిషేధిత వలలు వినియోగిస్తే కేసు లు నమోదు చేస్తామన్నారు.

బకాయిలు చెల్లించాలని వీవోఏల వినతి

అనంతసాగరం, ఆగస్టు 31: తమకు రావాల్సిన ఆరు నెలల జీతం బాకాయిలు చెల్లించాలని వెలుగు వీవోఏలు శనివారం సీఐటీయూ నాయకులతో కలిసి ఏపీవో రమణరావుకు వినతిపత్రం అందజేశారు. వీవోఏల అక్రమ తొలగింపులను నిలిపివేయాలని వినతిలో పేర్కొన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరిం చాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుజాత, లక్ష్మీ, సౌజన్య పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి

అనంతసాగరం, ఆగస్టు 31: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం గ్రామానికి చెందిన గౌస్ అనే వ్యక్తి మద్యం మత్తులో మంచాలపల్లికి చెందిన మరో వ్యక్తిపై కర్రతో దాడి చేశాడు. ఈ దాడితో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. దాడికి పాల్పడిన వ్యక్తి గతంలో బస్టాండ్‌లో నిలబెట్టిన కార్లు, ఆటోల అద్దాలు కూడా ధ్వంసం చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇతని తీరుతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది.

కాలువల ఆక్రమణ.. నిలిచిన మురుగు

- వెంగయ్యగారిపాలెంవాసుల కష్టాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కావలి రూరల్, ఆగస్టు 31: పట్టణంలోని వెంగయ్యగారిపాలెం పరిసరాల్లోని పంట కాలువలు, మురుగునీటి కాలువలను వైసీపీ నేతలు ఆక్రమించారు. దీంతో మురుగునీటి పారుదల లేక రోగాల పాలవుతున్నామని వెంగయ్యగారిపాలెంవాసులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని వెంగయ్యగారిపాలెం సమీపంలోని కావలమ్మ గుంటను ఆక్రమించడంతోపాటు ఆ గుంటకు వచ్చే నీరు కూడా రాకుండా గోడలు నిర్మించారు. అక్కడ లేఅవుట్లు వేసిన వైసీపీ నేతలు కాలువలు లేని వైపునకు మురుగును మళ్లించి చేతులు దులుపుకున్నారు. తమ పొలాలకు మురుగు మళ్లించటమేంటని రైతులు మురుగునీటి కాలువను పూడ్చివేశారు. దీంతో పట్టణంలో నుంచి వచ్చిన వర్షపునీరు, మురుగునీరు పారుదలకు వీలులేకుండా పోయింది. మురుగునీరు నిల్వ చేరటంతో దోమల బెడద ఎక్కువైందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కావ్య క్రిష్టారెడ్డి చొరవ తీసుకుని మురుగు నీటి కాలువల ఆక్రమణలు తొలగించి, మురుగునీటి పారుదల సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వెంగయ్యగారిపాలెం రోడ్డు పక్కన కాలువలో పొంగిన మురుగు


వెంగయ్యగారిపాలెం సమీపంలో కాలువను ఆక్రమించి కట్టిన గోడ

వర్షంతో భూముల పదును - అన్నదాతల హర్షాతిరేకాలు

జలదంకి, ఆగస్టు 31: వరుణుడి కరుణ కోసం ఆకాశానికేసి ఎదరుచూపులు చూస్తున్న అన్నదాతల ఆశలు ఫలించాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో భూములు పదునెక్కి పంటల సాగుకు అనువుగా తయారయ్యాయి. దీంతో మండల రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మాగాణి భూముల్లో పచ్చిరొట్టపైర్లు వేసేందుకు అన్నదాతలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. మెట్టభూముల్లో అపరాల పంటలు సాగు చేసే రైతులకు కూడా ఈ వర్షం ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. మండలంలో ఇటీవల అధికంగా సాగుచేసి జామాయిల్ చెట్లకు కూడా ఈ వర్షం ప్రయాజనం చేకూర్చనుంది. పశువులకు, జీవాలకు దాహార్తి తీరేందుకు నీటి వనరుల్లో నీరు చేరనున్నది. కాగా వర్షంతో సోమశిల ప్రాజెక్టులో నీటినిల్వలపై అన్నదాతలు ఆరాతీస్తున్నారు. జలాశయంలో 35 టీఎంసీలకు పైగా నీటినిల్వలు ఉండడంతో మరో 10 టీఎంసీలు అదనంగా చేరితే ఈ ఏడాది వరిసాగుకు ఇబ్బందులు ఉండవని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● కొండాపురం మండలంలో చిరుజల్లులు

కొండాపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శనివారం మండలంలో చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో గ్రామాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచి బురదమయంగా తయారయ్యాయి. కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిన ప్రజలు చిరుజల్లులతో ఊపిరి పీల్చుకున్నారు.


కొండాపురం : తూర్పుయర్రబల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

● మోస్తరు వర్షానికే రోడ్లపై నీరు

బిట్రగుంట : బోగోలు మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి మోస్తరు వర్షం కురుస్తున్నది. ఈ వర్షానికే మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన, అంతర్గత రోడ్లలో నీరు నిలిచింది. నాగులవరం పంచాయతీలో నిత్యం రద్దీగా ఉండే జడ్పీ ఉన్నత పాఠశాల, విలేజ్ హెల్త్ సెంటర్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ చేరాయి.

ప్రసన్నుడికి ప్రత్యేక పూజలు


ఊంజల్‌సేవలో స్వామి, అమ్మవార్లు

బిట్రగుంట, ఆగస్టు 31: బోగోలు మండలం కొండబిట్రగుంటలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో స్వామి,అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అల్లూరు మండలం ఇందుపూరుకు చెందిన అంబాటి చందు, లక్ష్మీ ప్రసన్న దంపతులు అన్న సంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్వామి,అమ్మవార్లకు దేవస్థానం వారు ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 9,75,532

వలేటివారిపాలెం, ఆగస్టు 31 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసంహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 9,75,532 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,950, కుంకుమార్చన ద్వారా రూ. 24,800, వివాహాల ద్వారా రూ. 13 వేలు, తలనీలాల ద్వారా రూ. 49,500, వాహనపూజల ద్వారా రూ. 3,260, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,92,600, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 700, రూముఅద్దెల ద్వారా రూ. 33,040, కవర్లు ద్వారా రూ. 6,900, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,12,580, అన్నదానం ద్వారా రూ. 3,00092, విరాళాల ద్వారా రూ. 31,116 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

లింగసముద్రం, ఆగస్టు 31 : తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి శనివారం విధుల్లో చేరారు.దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న రీసర్వే డీటీ టీ ప్రసాద్, వీఆర్‌వోలు, ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరిస్తామన్నారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి

అల్లూరు, ఆగస్టు 31 : పౌరహక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీటీ నాగలక్ష్మి అన్నారు. పట్టణ పరిధిలోని బోడిసత్రం గిరిజనకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహననిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశంలో ప్రతీ ఒక్కరికీ హక్కులున్నాయన్నారు. సమాజంలో స్వేచ్ఛగా జీవించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఏ రాజేశ్వరి, వెలుగు ఏపీఎం ప్రసాదరావు, వీఆర్వో రంతుల్లా, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి దళితుల సత్కారం

అల్లూరు, ఆగస్టు 31 : ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్‌బాబును అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు శనివారం సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి, అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దానం మాల్యాద్రి, ఉయ్యాల జగన్మోహన్‌రావు, గాలి వేణుగోపాల్, దర్శిగుంట వాసు, కర్రా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నలందాలో గ్రీన్‌డే సంబరాలు

కావలిటౌన్, ఆగస్టు 31: పట్టణంలోని గొల్లమూడి వీధిలో ఉన్న నలందా హైస్కూల్‌లో శనివారం గ్రీన్‌డే సంబరాలు జరిగాయి. విద్యార్థులు ఆకుకూరలు, పండ్ల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నలందా ఎండీ వసీం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడా పరికరాల పంపిణీ

లింగసముద్రం, ఆగస్టు 31 : స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు హైస్కూల్ పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త కొట్టే నారాయణ రూ.20 వేల విలువైన క్రీడా పరికరాలను ఉచితంగా అందించారు. శనివారం హైస్కూల్‌లో హెచ్ఎం యూ. మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాటిని ఆయన అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తలిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కొండయ్య, కే ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జేబీలో ముగిసిన క్రీడా పోటీలు


వాలీబాల్ ఫైనల్స్‌లో పోటీపడుతున్న బాలురు

కావలిటౌన్, ఆగస్టు31: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని జేబీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. పీడీ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ముగింపు సభలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జేబీ క్రీడలకు పుట్టినిల్లని, క్రీడాకారులను ప్రొత్సహించడంలో జేబీ యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టీటీ, షటిల్ తదితర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో ప్రత్యేక అభిషేకాలు

కలిగిరి, ఆగస్టు 31: మండలంలోని చంద్రారెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన హనుమత్, లక్ష్మణ సీతాసమేత కోదండరామస్వామి ఆలయంలో శనివారం వేదపండితులు నారాయణం శ్రీనివాస దీక్షితుల ఆధ్వర్యంలో క్షీరాధివాస, జలాధివాస అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జనసేన ఆధ్వర్యంలో చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

కావలి, ఆగస్టు31: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా జనసేన వీరమహిళ కందుల లక్ష్మీకవిత ఆధ్వర్యంలో శనివారం ఏరియా వైద్యశాలలో నిశానిటేషన్ విభాగపు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తక్కువ జీతంలో ఏరియా వైద్యశాలలో పారిశుధ్య సేవలు అందిస్తున్న మహిళలకు పవన్ జన్మదినం సందర్భంగా చీరలు అందచేయటం తమకెంతో ఆనందంగా ఉందని జనసేన నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ పద్మావతి, జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య, ఏరియా వైద్యశాల డైరెక్టర్ పొబ్బా సాయివిఠల్, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ నాయకులు ఆలా శ్రీనాథ్, గాదంశెట్టి రవికుమార్, జనసేన వీరమహిళలు భవాని, మాధురి తదితరులు పాల్గొన్నారు.

నేడు తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన


తుమ్మలపెంట రోడ్డు దుస్థితి

కావలి,ఆగస్టు31: గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన కావలి- తుమ్మలపెంట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఆదివారం ఉదయం తుమ్మలపెంట రోడ్డుకు మహిళలతో శంకుస్థాపన పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. ఉదయం 8 గంటలకు కావలి నుంచి పాదయాత్ర చేసుకుంటూ తుమ్మలపెంటకు వెళ్లి, అక్కడ కూడలిలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సీఎంగా చంద్రబాబు 30 ఏళ్ల కిందట తొలిసారిగా సెప్టెంబరు ఒకటిన బాధ్యతలు చేపట్టడంతో అదే రోజున తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

రైల్వే కార్మికుల షటిల్ పోటీల విజేత కావలి జట్టు

బిట్రగుంట : బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో కా వలి పీడబ్ల్యూఐ సిబ్బంది విజేతలుగా నిలిచారు. బిట్రగుంట యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు మద్దిబోయిన శేఖర్ యాదవ్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగిన పోటీలో కావలి జట్టు ప్రథమ బహుమతి కింద రూ. 3వేలతోపాటు కప్‌ను గెలుచుకుంది. బిట్రగుంట రన్నింగ్ స్టాఫ్ రెండోస్థానంలో నిలిచి రూ.2 వేలను, కప్‌ను, కృష్ణపట్నం సిబ్బంది మూడో స్థానంలో నిలిచి రూ.వేయి నగదుతో పాటు మెమొంటో అందుకున్నారు. విజేతలకు రైల్వేవైద్యులు ప్రభాకర్‌రాజు, కావలి, బిట్రగుంట పీడబ్ల్యూఐలు హుసేన్, కృష్ణన్, వీఎస్ మాల్యాద్రి శుక్రవారం అర్ధరాత్రి జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందచేశారు.

ఉచిత దంత వైద్యశిబిరం

కావలిటౌన్ : స్థానిక వెంగళరావునగర్‌లోని బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం విశ్రాంత సంక్షేమాధికారి ఖాదర్‌బాష పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ శ్యామ్‌సుధాకర్ అధ్యక్షతన ఉచిత దంత వైద్యశిబిరం జరిగింది. డాక్టర్ వినయ్ వినోద్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, దంతాల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రజాసంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం


బుచ్చిరెడ్డిపాళెం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి


వెంకటాచలం : పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 31: ప్రజాసంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని, ఒకటో తేదీకి ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ చేయడం చరిత్రలో ఇదే మొదటిసారి అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం ఆమె మండలంలోని పెనుబల్లి గిరిజన కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక సర్పంచు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా సాల్మానుపురం గ్రామంలో శ్మశానం లేక రోడ్డు పక్కనే శవ దహనాలు చేయాల్సి వస్తోందని, శ్మశానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి గ్రామస్థులు అర్జీ సమర్పించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరించాలని తహసీల్దారును ఆదేశించారు.

సమస్యల పరిష్కారంలో ఎస్టీలకు ప్రాధాన్యం : సోమిరెడ్డి

వెంకటాచలం : సమస్యల పరిష్కారంలో ఎస్టీలకే మొదటి ప్రాధాన్యమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ నక్కల కాలనీలో శనివారం ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను పరిష్కరించి పంచాయతీని అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, మండల కార్యదర్శి దొడ్ల అశోక్, పలువురు టీడీపీ నేతలు, వివిధ శాఖల అధికారులున్నారు.

ఒకరోజు ముందే వచ్చిన పింఛన్ల పండుగ : చెముకుల

విడవలూరు: రాష్ట్రంలో ఒకరోజు ముందుగానే పింఛన్ల పండుగ వచ్చిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య తెలిపారు. శనివారం స్థానిక లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాతూరు శ్రీనివాసులు రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

●**ముత్తుకూరు:** బ్రహ్మదేవం పంచాయతీలో శనివారం పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌కుమార్, టీడీపీ బ్రహ్మదేవం గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి మహేష్, పంచాయతీ కార్యదర్శి వాసుదేవరావు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

●**సైదాపురం:** పోతేగుంట, కొమ్మిపాడు, చీకవోలు, చాగణంలో శనివారం చేపట్టిన పింఛన్లు పంపిణీని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ దయాశ్, మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**తోటపల్లిగూడూరు:** నరుకూరు గ్రామానికి చెందిన వెంపులూరు మంజుల, పాకం బాబురావు నెల్లూరులో ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం ఆసుపత్రికి వెళ్లి డిజిటల్ అసిస్టెంట్ లోకేష్, ఎంపీటీసీ రఘుబాబు, టీడీపీ గ్రామ నాయకులు అరకటి వెంకటేశ్వర్లు అందచేశారు.

●**కొడవలూరు:** మండలంలో అన్ని గ్రామాల్లో శనివారం అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి గుండాలమ్మపాళెంలో, నార్సురాజుపాళెంలో మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కరకటి మలికార్జున, తలమంచిలో జోన్నశివకుమార్, యల్లయపాళెంలో కేతూ వెంకటరమణారెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


రైతు కుటుంబాన్ని విచారిస్తున్న తహసీల్దార్

మనుబోలు, ఆగస్టు 31: మండలంలోని పిడూరు పాళెం గ్రామానికి చెందిన రైతు పోతల నరేంద్రరెడ్డి రెండు రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ సుబ్బయ్య, మండల వ్యవసాయాధికారి జహీర్ రైతు ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ప్రభుత్వానికి నివేదికను పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో భగవాన్ ఉన్నారు.

చేపల చెరువుకు వేలం

విడవలూరు, ఆగస్టు 31: చౌకిచర్ల గ్రామంలోని చెరువులో చేపల పెంపకానికి శనివారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. సర్పంచు వినోద్, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు, సహాయకులు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీలత నేతృత్వంలో జరిగిన వేలంపాటలో గడ్డె ప్రతాప్ రూ. 93 వేలకి పాడుకున్నారు.

ఇల్లు దగ్ధం

కోవూరు, ఆగస్టు 31: వేగూరు మజరా కండ్రిగలో ఇంద్రపల్లి అశోక్‌కు చెందిన ఇల్లు శనివారం విద్యుదాఘాతం సంభవించి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటల్ని అదుపుచేశారు. సుమారు రూ. 5లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

సంచార పశు ఆరోగ్యసేవ వాహనం పరిశీలన

కోవూరు, ఆగస్టు 31: స్థానిక పశువైద్యశాలలో కదలని పశు ఆరోగ్యసేవ వాహనంపై గత బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త వెలువడింది. దీంతో స్పందించిన పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి శనివారం సంచార పశు ఆరోగ్యసేవ వాహనాన్ని పరిశీలించారు. పశు సంవర్ధక శాఖ సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరిం చారు. రైతు నాయకులు పొబ్బారెడ్డి మలికార్జునరెడ్డి, ముసలి సుధాకర్, ఇంతా శ్రీకాంత్‌రెడ్డి సంచార వాహన పని తీరును ఆమెకు వివరించారు. సంచార వాహన సిబ్బంది ఆమెకు పొంతనలేని సమాధానాలిచ్చారు. సంచార పశు ఆరోగ్య సేవ పనితీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని ఆమె రైతు నాయకులకు వివరించారు.

రూ.1.10 కోట్లతో వంతెనల నిర్మాణం

● **ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భూమిపూజ**

మనుబోలు, ఆగస్టు 31: మండలంలో యాచవరం, కట్టువపల్లి వద్ద చెరువులకు వెళ్ళే స్లపయ్‌చానల్‌పై రెండు వంతెనలను రూ. 1.10 కోట్లతో నిర్మిస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం రెండు వంతెనలకు భూమి పూజలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వెంకన్నపాళెం నుంచి కొలనుకుదురుకు రూ. 4కోట్లతో రోడ్డు మంజూరు చేయించామని, త్వరలోనే టెండర్లు పిలవనున్నామన్నారు. అనంతరం బద్దెవోలు, వెంకన్నపాళెం గ్రామాల్లో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈ వేమారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జిల్లా నాయకుడు పొన్నూరు రామకృష్ణయ్య, మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు మదునాయుడు, మస్తాన్ నాయుడు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా, పొదలకూరు, ముత్తుకూరులలో సోమిరెడ్డి శృతిరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.

పంచాయతీల అభివృద్ధికే పీఆర్‌వన్ యాప్

విడవలూరు, ఆగస్టు 31: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌ఒన్ యాప్‌ని తీసుకువచ్చిందని జిల్లా రిసోర్స్‌పర్సన్ టి శ్రీనివాసులు తెలిపారు. పీఆర్‌ఒన్ యాప్‌పై శనివారం ఎంపీడీవో శ్రీనివాసులు గాదెలదిన్నె, రామతీర్థం, వరిణి గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యాప్‌లో డ్రైన్లు, చెత్తసంపద కేంద్రాల వివరాలను ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న అంశాలను వివరించారు. అసంపూర్తిగా ఉన్న చెత్తసంపద కేంద్రాలను వచ్చేనెల 2వ తేదీలోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేవిధంగా ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందన్నారు.


యాప్ గురించి ఎంపీడీవోతో చర్చిస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులు

పాఠశాలల తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 31: మండలంలోని రేబాలలోని పలు పాఠశాలలను తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. రేబాలలోని తూర్పు దళితవాడ ఎలిమెంట్రీ స్కూలులో స్థానిక సర్పంచు భర్త మస్తానయ్య, ఎస్ఎంసీ ఛైర్మన్ కలిసి విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం

ముత్తుకూరు, ఆగస్టు 31: పచ్చదనాన్ని పెంపొందించడమే జనసేన లక్ష్యం అని పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని పైనాపురం పంచాయతీలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం దిబ్బ మీద దళితవాడ, వాగర్త దళిత కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ రహీద్, అశోక్, కావలి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న బొబ్బేపల్లి

సైదాపురం: కలిచేడులోని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఉన్నత పాఠశాల, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జనసేన నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతలపల్లి రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 31: జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో నిత్యాన్న దానానికి నెల్లూరుకు చెందిన కొంజేటి వెంకట సత్యనారాయణ, లక్ష్మీకుమారి దంపతులు శనివారం రూ. 50,116 విరాళం ఆలయ ఈఓ. ఏవీ శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈమేరకు విరాళానికి సంబంధించిన రసీదును ఈఓ దాతలకు అందజేశారు.


దాతలకు రసీదును అందజేస్తున్న ఈవో

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

మండలంలోని చెత్త సంపద కేంద్రాలన్నీ అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి నుంచి ఉపయోగంలోకి రావాలని డీపీఓ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండలంలోని రేబాల, చెల్లాయపాళెంలోని చెత్త సంపద కేంద్రాలను తనిఖీచేశారు. ఆయన వెంట కార్యదర్శులు శ్యాంసుందర్, మల్లికార్జునరెడ్డి, నారాయణ, సిబ్బంది వున్నారు.

రామకృష్ణమాచార్యులకు డాక్టరేట్

ముత్తుకూరు, ఆగస్టు 31: స్థానిక సంస్కృత అధ్యాపకులు నారాయణం ప్రసన్న రామకృష్ణమాచార్యులకు గౌరవ డాక్టరేట్ లభించింది. శనివారం ఉదయం తమిళనాడులోని హోసూరులో జరిగిన కార్యక్రమంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చి యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు గౌరవ డాక్టరేట్ అందజేశారు. రామకృష్ణమాచార్యులకు డాక్టరేట్ లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

ఇందుకూరుపేట, ఆగస్టు 31: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం గంగపట్నంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా పవన్ కల్యాణ్ యువత అధ్యక్షుడు హరికుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తదితరులు పాల్గొంటారని, జనసైనికులు, పవన్ అభిమానులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొనాలని కోరారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

గోవర్ధనగిరిధారిగా వేణుగోపాలుడు



నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 31 : నగరంలోని మూలా పేట వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణ అవతార ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గోవర్ధనగిరి ధారి అలంకారం వైభవంగా జరిగింది. మూల వర్లుకు విశేష పుష్పాలంకారం, పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉభయ కర్తలు, ఆలయ ఛైర్మన్ మజ్జిగ చంద్ర మౌళిరెడ్డి, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

కమనీయం మురళీకృష్ణుడి కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం): శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రాజేంద్ర నగర్ మురళీకృష్ణ దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం, సాయంత్రం చతుస్థాన అర్చనలు జరిగాయి. రాత్రి రుక్మిణీ, వరలక్ష్మీ సమేత మురళీకృష్ణ స్వామిలకు కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. అనంతరం కళ్యాణమూర్తులకు ఆలయ తిరువీధుల్లో ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా అలిమేలి సుబ్రహ్మణ్యంఆచారి, శ్రీహరి ఆచారి, శేఖరాచారి, శ్రీనివాసులు ఆచారి దంపతులు, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

కనులపండువగా శ్రీవారి పల్లకీసేవ

నెల్లూరు(సాంస్కృతికం): నగరంలోని మాగుంట లేఅవుట్ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీవారి పల్లకీసేవ కనుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష అలంకారం, పూజలు జరిగాయి. ఉభయకర్తలు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.



యూజీడీ పనులకు మహర్దశ

● **వెంకటేశ్వరపురంలో పునఃప్రారంభించిన మంత్రి నారాయణ**

నెల్లూరు(సిటీ), ఆగస్టు 31 : టీడీపీ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని దాదాపుగా తుది దశకు తీసుకువచ్చిన భూగర్భ డ్రైనేజీ పనులకు గత వైసీపీ ప్రభుత్వం గ్రహణం పట్టించగా కూటమి ప్రభుత్వంలో మళ్లీ పునఃప్రారంభిచడంతో మహర్దశ పట్టనుంది. శనివారం వెంకటేశ్వరపురంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పనులు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19లో నెల్లూరును స్వచ్ఛసిటీగా తీర్చిదిద్దేందుకు భారీ ప్రాజెక్టు చేపట్టామన్నారు. అందులో భాగంగా యూజీడీకి రూ.580 కోట్లు, తాగునీటికి రూ.550 కోట్లతో పనులు ప్రారంభించి 90 శాతం పూర్తి చేశామన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ కనీసం 5 శాతం కూడా ముందుకు తీసుకెళ్లలేదని విమర్శించారు. వాటిని మళ్లీ పూర్తి చేసి నెల్లూరును స్మార్టుసిటీగా తయారు చేస్తామని ప్రకటించారు. నాడు నెల్లూరులో ఆగిపోయిన పనులన్నింటిని పూర్తి చేసి వాటి ఫలితాలను ప్రజలకు అందిస్తామన్నారు. ముందుగా 11వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లిన ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కాగా 10వ డివిజన్‌లో ఆయన కుమార్తె శరణి టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ సూర్యతేజ, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్‌అజీజ్, తాళ్లపాక అనురాధ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


రోడ్ కట్టింగ్ యంత్రంతో పనులు ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

విషజ్వరాలపై అవగాహన కల్పించండి : మేయర్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 31 : వాతావరణం మార్పులతో ప్రజలను పీడిస్తున్న విషజ్వరాలపై అవగాహన కల్పించాలని ఎన్ఎంసీ మేయర్ పొట్లూరి స్రవంతి వైద్యులకు సూచించారు. శనివారం రామచంద్రపురం ఎఫ్‌సీఐ కాలనీలోని పీహెచ్‌సీకి వెళ్లిన ఆమె అక్కడున్న వైద్యులతో మాట్లాడారు. జ్వరపీడితులు ఎక్కువగా నమోదవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరి శుభ్రత కూడా ముఖ్యమని, అక్కడున్న రోగులకు సూచించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ నామమాత్రం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 31: గత ప్రభుత్వంలో జరిగిన ఇళ్ల నిర్మాణాలలో అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు నామమాత్రంగా విచారణ చేస్తున్నారని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఆరోపించారు. ఈ మేరకు నగరంలోని విజిలెన్స్ కార్యాలయంలో అధికారులకు శనివారం ఆయన వినతిపత్రం అందచేశారు. విచారణ సమయంలో ఎంత స్టీలు, ఎంత సిమెంటు వినియోగించారని దర్యాప్తు చేయమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా ఆ పార్మెట్‌ను పరిగణలోకి తీసుకోకుండా విజిలెన్స్ అధికారులు విచారణ సాగిస్తున్నారన్నారు. లబ్ధిదారుల ప్రయోజనాలను కాపాడేలా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

జాతీయ హాకీ పోటీలకు జశ్వంత్

నెల్లూరు(విద్య), ఆగస్టు 31 : నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన ఎస్.జశ్వంత్ జాతీయ హాకీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో సెప్టెంబరులో జరగనున్న జాతీయ హాకీ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారుడు జస్వంత్‌ను శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సిబ్బందికి సన్మానం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 31: పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ కే ప్రసాద్, సంతపేట హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులుని శనివారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కృష్ణకాంత్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ సిబ్బందిని సన్మానించిన ఎస్పీ కృష్ణకాంత్

● **ఆర్టీసీలో..**

ఏపీ పీటీడీలో 35 ఏళ్లుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ ముదుగోటి సుబ్రహ్మణ్యం, దుర్గాదేవి దంపతులను ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, డిప్యూటీ సీటీఎం కార్యాలయ అధికారులు వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. నగరంలోని ఆర్టీసీ నెల్లూరు రీజియన్ కార్యాలయంలో శనివారం సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగలక్ష్మి, యూనియన్ నాయకులు శామ్యూల్‌బాబు, నారాయణరావు, యుగంధర్, రాజా, ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

● **బీసీ సంక్షేమాధికారి ఉద్యోగ విరమణ**

నెల్లూరు(హరనాథపురం) : జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంటయ్య శనివారం ఉద్యోగ విరమణ చేశారు. వెంకటయ్య సెట్నెల్ సీఈవోగా, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా, సాంఘీక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీగా అదనపు బాధ్యతలు కూడా నిర్వహించి అందరి మన్ననలు పొందారు.

● **డెమో శ్రీనివాసరావుకు సన్మానం**

నెల్లూరు (వైద్యం) : వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న డెమో శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగింది. ఆయనను డీఎంహెచ్‌వో పెంచలయ్య, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో ఉమామహేశ్వరి, డాక్టర్ శ్రీనాథ్, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు కరకరత్నం పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

నెల్లూరు (విద్య), ఆగస్టు 31 : మొక్కలు నాటి సంరక్షించడం తోనే పర్యావర పరిరక్షణ జరుగుతుందని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. నగరంలోని మాగుంటలేఅవుట్ విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కే పాఠశాలలో శనివారం నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి చెట్లు, వాటివలన కలిగే లాభాలను తెలియచేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పరిరక్షించేలా సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి క్లీన్ అండ్ గ్రీన్ పేరుతో సేవ్ ది ప్లానెట్ అనే నినాదాలతో మినీబైపాస్‌లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ రఘురామ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలతో ర్యాలీ నిర్వహిస్తున్న 'విశ్వసాయి' విద్యార్థులు

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ముందస్తుగా శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మొక్కలు పంపిణీ చేశారు. నగరంలోని ఐదో డివిజన్ వైకుంఠపురం ప్రాథమిక పాఠశాలలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, అజయ్ బాబు, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో 2 వేలకు పైగా మొక్కలు పంపిణీ చేశారు.



● **మహిళా ప్రాంగణం, అర్బన్ ఐసీడీఎస్‌లో 'వనం-మనం'**

నెల్లూరు(హరనాథపురం): నగరంలోని ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం, మహిళా ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, అర్బన్ సీడీపీవో అన్నపూర్ణ, మహిళాప్రాంగణ జిల్లా మేనేజర్ కె.మాధవి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● **మొక్కలు నాటిన టీడీపీ శ్రేణులు**

నెల్లూరు(వైద్యం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని బాలకృష్ణ సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి కోరారు. నగరంలో శనివారం టీడీపీ నేతలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి పొంగూరు నారాయణ ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలు నాటాల న్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో ప్రాణాధారమైన ఎన్నో చెట్లను నరికేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కేసీ కృష్ణ, టీవీనటుడు సింగంశెట్టి మురళీమోహన్ రావు, నేతలు బండి రమేష్, అల్లంపాటి రమణయ్య, శ్రీహరినాయుడు, నిరంజన్‌బాబు, భాస్కర్‌రాజు, ఎస్సీబాబు, ధరణికుమార్, సునీల్‌నాయుడు పాల్గొన్నారు.



ఒక్కరోజు ముందే పింఛన్ పండుగ : రూరల్ ఎమ్మెల్యే


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఆగస్టు 31 : దేశ చరిత్రలో 1వ తేదీ కంటే ముందుగా అవ్వతాతలకు పింఛన్ నగదు అందించిన ప్రభుత్వం టీడీపీ ఒక్కటేనని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం 35వ డివిజన్ లేక్‌వ్యూ కాలనీలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒక్క రోజు ముందు 31నే పింఛన్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడం గొప్ప అంశమన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడటం, వారి అభ్యున్నతికి కట్టుబడి ఉండటం టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలనాయుడు, వహిదా, బర్నాబస్‌లు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వండి

నెల్లూరు(సాంస్కృతికం): వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పి.సత్యనాగేశ్వరరావు, కార్యదర్శి పి.సురేంద్రరెడ్డి, కోశాధికారి ఏఏఆర్ .మోహన్‌రావు, మండ్ల ఈశ్వరమ్మ, కేవీ సుబ్రహ్మణ్యంల బృందం శుక్రవారం రాత్రి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణకు వినతిపత్రం అందజేశారు.

● **రూ.కోటితో గణేష్ ఘాట్ వద్ద ఏర్పాట్లు**

నగరంలో వినాయక చవితి అనంతరం విగ్రహాల నిమజ్జనం కోసం రూ.కోటితో పనులు చేపట్టారు. క్రేనులు, భారీ వాహనాలు రాకపోకలకు అనుగుణంగా వాకర్స్ రోడ్డును అనుసంధానం చేస్తూ 3వ రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. ఘాట్‌లో జమ్ము, గుర్రపుడెక్కలను తొలగిస్తున్నారు. ఘాట్ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు.

● నగరంలోని శివాజీ (లస్సీ) సెంటర్, టీవీఎస్ కళ్యాణ్‌సదన్‌లో ఆదివారం విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కార్యాలయంను ప్రారంభిస్తున్నట్లు సమితి నాయకులు తెలిపారు. నగరంలోని గణేష్ మండపాలకు కావాల్సిన అన్ని అనుమతులు సింగిల్ విండో ద్వారా తీసుకునేందుకు ఉత్సవ నిర్వాహకులు టీవీఎస్ కళ్యాణ్‌సదన్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.


ఘాట్‌లో జమ్ము, గుర్రపుడెక్క తొలగింపు

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరరావు

పెళ్లకూరు, ఆగస్టు 31: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముమ్మారెడ్డిగుంటలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థలకు బానిసలు కాకూడదని, గంజాయి తదితర మత్తు పదార్థాలను వాడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలపై అఘాత్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఆర్ఐ సంతోషీబాయి, ఎస్ఐ శ్రీకాంత్, వీఆర్వో కళ్యాణి, సర్పంచు రాంబాబు, మారాబత్తిన గురవయ్య, చంద్ర, వెంకటేష్, రవి తదితరులు ఉన్నారు.

బాలకృష్ణ అభిమానుల సంబరాలు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 : సినీరంగంలో ఎదురులేని నటుడు నందమూరి బాలకృష్ణ అని బాలకృష్ణ అభిమాన సంఘం డివిజన్ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి అన్నారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణ సినీ పరిశ్రమలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో శనివారం నాయుడుపేటలో కందల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. బాలకృష్ణ సినిమా రంగంలోనే కాకుండా ప్రజాసేవలో బసవతారక క్యాన్సర్ వైద్యశాల నెలకొల్పి తనవంతు సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ పాదర్తి ప్రకాష్‌నాయుడు, ప్రసాద్, బంగారుబాబు, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, రాజు, సిరాజ్, కిషోర్ పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు

ఓజిలి, ఆగస్టు 31 : గత ఏడాది తుపానుకు దెబ్బతిన్న ఓజిలి చెరువు (పెద్దచెరువు) కట్టకు మరమ్మతులు చేపట్టారు. చెరువు కట్ట మరమ్మతులకు ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్లు (ఎఫ్‌డీఆర్) కింద టీడీపీ ప్రభుత్వం 9 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో చెరువు కట్టకు 400 మీటర్ల మేరకు జంగిల్ క్లియరెన్సు, గ్రావెలింగ్ పనులు చేపట్టేలా అధికారులు నిర్ణయించారు. కాగా మిగిలిన చెరువు కట్టకు కూడా వరద తాకిడి కారణంగా మరమ్మతులకులోనై ఉంది. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు కంకణాల సత్యవరప్రసాద్‌రావు చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టేందుకు నిర్ణయించారు. దీంతో చెరువు కట్ట మరమ్మతుల పనులు జరుగుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంఈవో

డక్కిలి, ఆగస్టు 31 : పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా బావించి మొక్కలు నాటాలని ఎంఈవో జగదీష్‌బాబా అన్నారు. శనివారం ఆయన మండలంలోని కంతలవారిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల విద్యాప్రమాణాలను తెలుసుకొన్నారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట పధానోపాధ్యాయులు ఉప్పళ పరిళికుమారి. రత్నప్రభ తదితరులు వున్నారు

ఊనుగుంటపాళెంలో వనమహోత్సవం



కోట, ఆగస్టు 31 : మండల పరిధిలోని ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల్లో శనివారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో వనమహోత్సవం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కవిత ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాలలో మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, అధికారుల ఆధ్వర్యంలో చెట్ల ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ జరిగింది.

బాలాయపల్లిలో క్లీన్ ఆంధ్ర - గ్రీన్ ఆంధ్ర



మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు, అధికారులు

బాలాయపల్లి, ఆగస్టు 31: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పగడాల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్ర-గ్రీన్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్‌కుమార్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, రామారావు అనిల్, అరవ రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూదూరు భూ సమస్యపై ప్రజాకోర్టు



ఇరు పక్షాల వాదనలు వింటున్న తహసీల్దార్

దొరవారి సత్రం, ఆగస్టు 31: మండల పరిధిలోని బూదూరులో నెలకొన్న పట్టా భూముల సమస్యపై శనివారం తహసీల్దార్ శైలాకుమారి ప్రజాకోర్టు నిర్వహించారు. ఆ గ్రామంలోని 20 మంది రైతుల పట్టా భూములను వారి ప్రమేయం లేకుండా రియల్టర్ రవీంద్రనాయుడు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని ఫిర్యాదు మేరకు ప్రజాకోర్టు నిర్వహించారు. రైతులు, రియల్టర్ వాదనలను తహసీల్దార్ విన్నారు. ఇరుపక్షాల నడుమ వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరుపక్షాలను శాంతింపచేశారు. రిజిస్ట్రేషన్లు తమ ప్రమేయం లేకుండా జరిగాయని రైతుల వాదన. తాను నగదు ఇచ్చి కొనుగోలు చేసుకొని రిజిస్ట్రేషన్‌ను చేసుకొన్నానని రియల్టర్ తెలిపారు. ఇరుపక్షాల వాదనలు రికార్డు చేసి తదుపరి నిర్ణయం తీసుకొంటామని తహసీల్దారు తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

దుకాణాల కేటాయింపు

డక్కిలి, ఆగస్టు 31 : డక్కిలి గ్రామ పంచాయతీకి చెందిన 5 దుకాణాలకు శనివారం స్థానిక సచివాలయ భవనంలో ఈవోపీఆర్‌డీ అల్లాభక్షు ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. పాటలో దుకాణాలను సొంతం చేసుకొన్న వారు ప్రతి నెలా క్రమం తప్పకుండా అద్దె చెల్లించాలన్నారు. పాతబకాయిలు చెల్లించని వారిపై కేసులు పెడతామని అధికారులు స్పష్టం చేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

సూళ్లూరుపేట, ఆగస్టు 31: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు ఆన్‌లైన్ ద్వారా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ వి.బ్రహ్మనాయుడు సూచించారు. చవితి ఉత్సవాలకు ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా సింగిల్ విండో యాప్ తీసుకొచ్చిందని, దీని ద్వారా కమిటీ నిర్వాహకులు సులువుగా మొబైల్ యాప్ ద్వారానే అనుమతి తీసుకోవచ్చునన్నారు. గతంలో ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్ ఇలా అన్నిశాఖల అధికారుల వద్దకు తిరిగి అనుమతి తీసుకొనేవారు. ప్రస్తుతం అలా కాకుండా సింగిల్ విండో యాప్ ద్వారా కమిటీ నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకొని అనుమతి తీసుకొంటే సరిపోతుందన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఆగస్టు 31: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రికి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

నారాయణ కళాశాలలో వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 31: స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవిప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, విశ్వక్సేనారెడ్డి, కోటేశ్వరరావు, సుధీర్ పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



బాలాయపల్లి, ఆగస్టు 31: బాలాయపల్లి నూతన ఎస్ఐగా కామినేని గోపి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్ సుబానీ బదిలీపై పల్నాడు జిల్లాకు వెళ్లగా నాయుడుపేటలో పనిచేస్తున్న గోపి బాలాయపల్లికి నియమితులయ్యారు.

సిద్ధిపురంలో సివిల్ రైట్స్ డే

దొరవారిసత్రం, ఆగస్టు 31: మండలంలోని సిద్ధిపురం గిరిజన కాలనీలో శనివారం అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దారు శైలాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పౌర హక్కుల గురించి గ్రామస్తులకు వివరించారు. భూ సమస్యలు, రేషన్ కార్డుల కొరత ఉంటే ప్రజలు నేరుగా తమ దృష్టికి తేవచ్చునని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ గోపినాథ్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్య, గృహనిర్మాణశాఖ ఏఈ మోహన్ పాల్గొన్నారు.

విద్యాకమిటీ ఎన్నిక మళ్లీ వాయిదా

కోట, ఆగస్టు 31 : కోట మండలం పెదగోవిందపల్లి ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఎన్నిక శనివారం కోరం లేక నాల్గవసారి వాయిదా పడింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఏ వైపు వెళ్లి చేతులెత్తితే ఎక్కడ రాజకీయంగా ఇబ్బందులు వస్తాయోనని ఎన్నికలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఎన్నికకు 50శాతం కూడా తల్లిదండ్రులు రాకపోవడంతో ఎంఈవో దారా మస్తానయ్య, హెచ్‌ఎం గిరిబాబు చైర్మన్ ఎన్నికను పూర్తిగా రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు.

నెల్లూరుపల్లి కొత్తపాళెంలో పౌరహక్కుల దినోత్సవం

కోట, ఆగస్టు 31 : మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం గిరిజన కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవానీతోపాటు పలుశాఖల అధికారులు పౌరహక్కుల గురించి అవగాహన కల్పించారు. రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కులు, వాటి వినియోగం అనే అంశాలను వివరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ ప్రసన్న, ఎంపీటీసీ నారాయణ, టీడీపీ నాయకులు నెల్లూరు మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాకాడు ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



వాకాడు, ఆగస్టు 31 : వాకాడు ఎంపీడీవోగా మనోహర్ గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిట్టమూరు మండలంలో ఈవోపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీవోగా వాకాడుకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు వలంటరీ రిటైర్డ్‌మెంట్ ఇవ్వడంతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెళ్లకూరు, ఆగస్టు 31 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పుల్లూరు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

హామీని నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుదే





గూడూరులో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, వెంకటగిరిలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

గూడూరు, ఆగస్టు 31: ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఇందిరానగర్‌లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్లను రూ. 4 వేలకు పెంచి, చెప్పిన ప్రకారం ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందిస్తున్నామన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్, రమణయ్య, వాసు, జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. గూడూరు మండలంలోని చెన్నూరులో టీడీపీ తిరుపతిపార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు.కార్యక్రమంలో కృష్ణయ్య, చంద్ర పాల్గొన్నారు.

చిల్లకూరు : టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందితోపాటు లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాములు పాల్గొన్నారు.

వెంకటగిరి: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం ఉదయాన్నే పట్టణంలోని 3వ వార్డులో అర్హులకు పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు. అవ్వారు సత్యం, మంకు ఆనంద్, కౌన్సిలర్ పోట్టేళ్ళ ప్రభావతి, చెలికం మధురెడ్డి, వెంకటసుబ్బయ్య, ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : మండలంలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీని 97.48 శాతం పూర్తి చేశారు. ఎంపీడీవో సింగయ్య పర్యవేక్షణలో ఉదయం నుంచే సచివాలయ సిబ్బందిచే ఇంటింటికెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ చంద్రబాబు : ఎమ్మెల్యే విజయశ్రీ



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, ఆగస్టు 31 : రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కేరాఫ్‌గా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దిగువ చావాలిలో ఏర్పాటు చేసిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి, సర్పంచు శ్రీపతి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట : ఉద్యోగస్తుల జీతాల వలే పింఛన్‌దారులకు వారి ఇంటి వద్దకే ఎన్డీఏ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో శనివారం వివిధ రకాల పింఛన్లను అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు నియోజకవర్గంలో పొలాలకు వెళ్లే దారులకు, శ్మశానవాటికలకు వెళ్లే దారులకు దాదాపు 140 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. వైస్ చైర్మన్ రఫీ, నెలవల రాజేష్, ఫైలారి శోభారాణి, రాజశేఖర్, శోభన్‌నాయుడు, మొుండెం బాబు, నానాబాల సుబ్బారావు, నారాయణ తదితరులు ఉన్నారు.

సూళ్లూరుపేట : మున్సిపాలిటీ, మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఇంటింటికెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో, వార్డుల్లో సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పింఛన్లను అందజేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, పార్టీ నాయకులు, వి.రమేష్, తిరుమలరావు, కృష్ణయ్య, తిరుపాల్, వెంకటేశ్వర్లు, పి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి : ఓజిలి మండలం మనవాలిలో ఎమ్మెల్యే విజయశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. మండల టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, ఓజిలి బీసీ సెల్ అధ్యక్షడు వంకాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాకు తెలియకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులా ?

చిట్టమూరు మండల సమావేశంలో నిలదీసిన సర్పంచులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చిట్టమూరు, ఆగస్టు 24 : సర్పంచ్‌లకు తెలియకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, దీంతో సర్పంచ్‌లకు విలువ లేకుండా చేస్తున్నారని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియాగా మారారని కొందర ఎంపీటీసీ సభ్యులు ప్రస్థావించారు. అంతేకాక జాతీయ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు వీవోఏలను తొలగించారని ఆయా శాఖల అధికారులు నిలదీశారు. దీంతో కొంతసేపు సమావేశం రసాభాసగా జరిగింది. సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరవుతున్నారని, తమ సమస్యలను ఎవరికి తెలియజేయాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. ఇరిగేషన్, వెలుగు, ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు, విద్యుత్ శాఖల అధికారులు సమావేశానికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాలెడ్, జడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, తహసీల్దార్ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ మనోహర్ గౌడ్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో పచ్చదనం కరువు

జాడలేని వనమహోత్సవం



డివైడర్లపై కానరాని పచ్చదనం

సూళ్లూరుపేట, ఆగస్టు 31: సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం కరువైంది. ఎక్కడ చూసినా ఖాళీ స్థలాలు, మొక్కలు లేని డివైడర్లే దర్శనమిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో మున్సిపాలిటీ పరిధిలోని హోలీక్రాస్ సర్కిల్ నుంచి చెంగాళమ్మ ఆలయం వరకు డివైడర్లపై మొక్కలు నాటారు. ఆ మొక్కల సంరక్షణ బాధ్యత మున్సిపాలిటీకి అప్పగించారు. డివైడర్లపై ఏపుగా పెరిగిన మొక్కలను ఎన్నికల ముందు మొద్దులు కోసివేయడంతో అవి మళ్లీ చిగురించలేదు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో మాత్రం వనమహోత్సవ కార్యక్రమం కానరాలేదు. మున్సిపాలిటీలో మొక్కల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల పర్యవేక్షణ కూడా కరువైంది. డివైడర్లపై ఉన్న మొక్కలను నరికివేసిన మున్సిపల్ అధికారులు మళ్లీ వాటి గురించి పట్టించుకోలేదు. ఇకనైనా మున్సిపల్ అధికారులు మొక్కలు నాటి పచ్చదనంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

కలవకొండలో రక్తదాన శిబిరం

చిల్లకూరు, ఆగస్టు 31: కలవకొండ గ్రామంలోని క్రీడామైదానంలో శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా జనసేన నాయకులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా వనమహోత్సవంలో భాగంగా క్రీడామైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సుధబూర్, వెంకటేష్, మనోజ్, మోహన్, సునీల్, కుమార్, మహేష్, మధు, సుబ్రమణ్యం, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రమాదకరం : మాజీ ఎంపీ చింతా



మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతా మోహన్

గూడూరు, ఆగస్టు 31: ఎస్సీ వర్గీకరణ చేపట్టడం దేశానికే ప్రమాదకరమని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం టవర్‌క్లాక్ వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై కుట్ర పన్నుతున్నాయన్నారు. టీటీడీలో వీఐపీ బ్రేక్ దర్శనాల టిక్కెట్లను కొంతమంది దళారులు బ్లాక్‌లో అమ్ముకోవడం దారుణమైన విషయమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు మూడు నెలల పరిపాలనలో చేపట్టింది ఏమీ లేదన్నారు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారావు, నాగభూషణం, తాజుద్దీన్ పాల్గొన్నారు.

నాయుడుపేట : విభజించు, పాలించు అన్న బ్రిటీష్ పాలనపంథాలో నేడు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు, బహుజనులు ఐక్యత ద్వారా రాజ్యాధికారాన్ని పొందుగలుగుతారని గ్రహించిన ఈ ప్రభుత్వాలు వాటిని విభజించే దిశగా పనిచేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు గాడి వెంకటయ్య, నాగూర్‌బాబు తదితరులు ఉన్నారు.

కాలుష్యం నుంచి కాపాడండి

కోట, ఆగస్టు 31 : కోట పట్టణంలోని దాదారాయిగుంట సమీపంలో ఉన్న అటుకుల మిల్లు కాలుష్యం నుంచి కాపాడాలంటూ శనివారం స్థానికులు తహసీల్దారు జయజయరావుకు ఫిర్యాదు చేశారు. బయటప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ అటుకుల మిల్లు నిర్వహిస్తున్నారన్నారు. రాత్రంబవళ్లూ మిల్లు యాజమాన్యం అటుకుల దంపకాలు చేస్తున్నారన్నారు. దీనివల్ల మిల్లు నుంచి వచ్చే పొగ నివాస గృహాలలోకి వచ్చి తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోందన్నారు. తక్షణం స్పందించి ఈ అటుకుల మిల్లును మూసివేయించాలని స్థానికులు తహసీల్దారును కోరారు.

వీహెచ్‌పీ షష్ఠ్యాబ్ది ఉత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు31: సూళ్లూరుపేటలో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్ఠ్యాబ్ది ఉత్సవాలను శనివారం స్థానిక సత్యసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తిచేసుకొన్న సందర్భంగా దేశవ్యాప్తంగా షష్ఠ్యాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల ప్రఖండ స్థాయిలో షష్ఠ్యాబ్ది ఉత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లెమాల మురళిరెడ్డి, ఉపాధ్యక్షుడు కమ్మిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు సుంకర ప్రతిమ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు సన్మానం



వెంకటగిరి టౌన్, ఆగస్టు 31: వెంకటగిరి తహసీల్దార్ మునిలక్ష్మి సేవలు అభినందనీయమని డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు అన్నారు. శుక్రవారం ఆమె పదవీ విరమణ అవడంతో ఆమెను సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొద్ది రోజుల్లోనే సిబ్బంది సమస్యలు, కలుపుతనం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ డీటీ యువరాజ్, ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరం

వెంకటగిరిటౌన్, ఆగస్టు 31: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ 52వ పుట్టిన రోజు సందర్భంగా జనసేన నెల్లూరు జిల్లా ఉమ్మడి ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు శుక్రవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029లో జనసైనికులు కలిసికట్టుగా ఉండి పవన్‌కళ్యాణ్‌ను సీఎంగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.



వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నడుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ఏడు నియోజక వర్గాల పరిధిలో ప్రజాప్రతినిధులు భిన్న పోకడలు ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ పాలనకు సంబంధించి పోలీసు, రెవిన్యూ, గ్రామ పంచాయతీ, విద్యుత్ తదితర శాఖలతో ప్రజలకు రోజువారీ వ్యవహారాలు ముడిపడివున్న నేపథ్యంలో అధికారులు, ఉద్యోగుల బదిలీలపై ప్రజాప్రతినిధులు తలోవిధంగా వ్యవహరిస్తున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ముఖ్యనేతల కుటుంబాల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తుండగా మూడు నియోజకవర్గాల్లో తెరవెనుక కీలక నేత పేరే ప్రముఖంగా వినిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బదిలీలలు

అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో నేతల భిన్న పోకడలు

విద్యుత్‌శాఖలో రిటైర్డు అధికారి సిఫారసే కీలకం

నాలుగు చోట్ల కుటుంబాల జోక్యం... మూడుచోట్ల తెరవెనుక నేత ప్రమేయం

సూళ్ళూరుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాల్లో బదిలీల వ్యవహారాల్లో ముఖ్యనేతల కుటుంబ సభ్యుల ప్రమేయం కనిపిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. సూళ్ళూరుపేటలో ముఖ్యనేత స్థానం నామమాత్రం కాగా తండ్రి, సోదరుడు, జీవితభాగస్వామి తదితరుల జోక్యం ఎక్కువైందని పార్టీ వర్గాలే ఆరోపిస్తున్నాయి. పోలీసు, రెవిన్యూ, ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగులు వీరిని ఆశ్రయిస్తున్నారు. ఆదాయం వున్న పోస్టులకు పోటీ తీవ్రంగా వుంది. గూడూరు ప్రాంత అధికారులు తడ, సూళ్ళూరుపేట మండలాలకు వచ్చేందుకు గట్టిగా యత్నిస్తున్నారు. సత్యవేడులో ముఖ్యనేత కుమారుడి జోక్యం మునుపటికంటే పెరిగిందని పార్టీ వర్గాలు వాపోతున్నాయి. శ్రీకాళహస్తిలో ముక్కంటి దేవస్థానం అంతర్గత బదిలీలలో ముఖ్యనేత కుటుంబీకులు కల్పించుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇక తిరుపతిలో కూడా ముఖ్యనేత సోదరుడి కుమారుడితో పాటు వారికి సన్నిహితంగా వుండే కూటమి పార్టీల నేతలు కొందరి ప్రమేయం కన్పిస్తోందన్న విమర్శలున్నాయి.వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో తెర వెనుక ప్రముఖ నేత ఒకరు కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. ప్రధానంగా పోలీసు శాఖకు సంబంధించిన బదిలీలన్నింటిలో ఈ ప్రముఖ నేత నిర్ణయమే పనిచేసిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ నేత సన్నిహిత బంధువు కూడా బదిలీల్లో జోక్యం చేసుకుని సిఫారసులు చేస్తున్నారని, ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతలు సైతం ఆ వ్యక్తి సిఫారసులకే విలువ ఇస్తున్నట్టు సమాచారం.

సత్యవేడులో బదిలీలపై సీఎంవో దృష్టి?

సత్యవేడు నియోజకవర్గంలో దాదాపుగా బదిలీలన్నీ డబ్బు ప్రమేయంతోనే జరుగుతున్నట్టు పార్టీ వర్గాలే నేరుగా సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు చేసినట్టు తెలిసింది. దీంతో ఆరా తీసిన సీఎంవో వర్గాలు సత్యవేడులో పరిస్థితి పట్ల తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ నియోజకవర్గంలో ముఖ్య అధికారుల బదిలీలకు సంబంధించి వచ్చే సిఫారసులను తమ దృష్టికి తేవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్టు పార్టీ వర్గాలే చెబుతున్నాయి. గతంలో వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేసిన పలువురు అధికారులు, ఉద్యోగులు అక్కడే కొనసాగడానికి యత్నిస్తున్న నేపథ్యంలో సీఎంవోకు ఫిర్యాదులు వెళ్ళినట్టు తెలిసింది.

చంద్రగిరి నుంచీ అందరూ కదలాల్సిందే!

చంద్రగిరి నియోజకవర్గంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు అందరూ గత ఐదేళ్ళూ అనివార్యంగా వైసీపీ నేతలతో అంటకాగాల్సి వచ్చింది. అప్పట్లో ఆ పార్టీ నేతలు చెప్పినట్టల్లా వినాల్సివచ్చింది. దీంతో ఇపుడు జరుగుతున్న బదిలీల్లో దాదాపుగా అందరినీ నియోజకవర్గం నుంచీ వెలుపలికి బదిలీ చేయాలని ముఖ్యనేత నిర్ణయించినట్టు సమాచారం. దీంతో ఎవరు సిఫారసు చేసినా లోతుగా ఆరా తీసిన తర్వాతే సిఫారసు లేఖలు ఇస్తున్నట్టు తెలిసింది. అయితే ఆరోపణలున్న వారి విషయంలో మాత్రం ఎవరు చెప్పినా వినకుండా కఠినంగా వ్యవహరిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కొందరి పనితీరు పట్ల ఆగ్రహంగా వున్న ముఖ్యనేత అలాంటి వారిని నియోజకవర్గంలో కొనసాగించకపోగా చుట్టుపక్కల నియోజకవర్గాల్లో కూడా నియమించవద్దని ఇరుగుపొరుగు ముఖ్యనేతలను కోరుతున్నట్టు సమాచారం.

శ్రీకాళహస్తికి వచ్చేందుకు అధికారుల విముఖత

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు శాఖలకు సంబంధించి బాగా ఆదాయం వచ్చే కీలక స్థానాలున్నప్పటికీ అక్కడికి వచ్చేందుకు అధికారులు విముఖంగా వున్నట్టు సమాచారం. నియోజకవర్గంలో ముఖ్యనేత ఒకరు అధికారుల పట్ల దురుసుగా మాట్లాతున్నారన్న ప్రచారం నేపథ్యంలో అధికారులు ఆసక్తి చూపడం లేదని సమాచారం.తాము ఏమి చెబితే అది చేసేందుకు అంగీకరించే అధికారులను నియమించుకునేందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టు తెలిసింది.కాగా ముఖ్యనేతకు సన్నిహితంగా వుండే ఇద్దరు నాయకులు బదిలీల వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముక్కంటి ఆలయ అంతర్గత బదిలీల్లోనూ, ఏర్పేడు మండలంలో పలువురి బదిలీల విషయంలోనూ ముఖ్యనేత కుటుంబీకుల జోక్యం వున్నట్టు పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

తిరుపతిలో గందరగోళం

తిరుపతి నియోజకవర్గంలో ముఖ్యనేత సోదరుడి కుమారుడి జోక్యం బదిలీల వ్యవహారంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఇక్కడ కూటమి పార్టీల నాయకులు పలువురు చురుగ్గా వుండడంతో ఎవరి స్థాయిలో వారు బదిలీలకు సిఫారసులు చేస్తున్నారు. దీంతో పరిస్థితి గందరగోళంగా మారుతోంది.అర్బన్ తహసిల్దారు కార్యాలయానికి వచ్చేందుకు చుట్టుపక్కల మండలాల అధికారులు, ఉద్యోగులు తీవ్రంగా యత్నిస్తున్నారు.ఇక్కడ పనిచేసే రెవిన్యూ ఉద్యోగులకు భారీగా అక్రమాదాయం వుండడమే ఇందుకు కారణం. ఇక్కడ పనిచేసిన ఓ డీటీ ఒకరు రూ. వంద కోట్లకు పైగా వెనకేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.తిరుపతి అర్బన్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం వెనుక ఆ డీటీ పాత్ర కీలకంగా వుందన్న ఆరోపణలున్నాయి. మరో ఆర్ఐదీ అదే తీరని, సైలెంట్‌గా వుంటూ పని కానిచ్చేస్తారన్న పేరుందని సమాచారం.వీరి అక్రమార్జనను చూసి ఇతర ప్రాంతాల ఉద్యోగులు ఇక్కడికి వచ్చేందుకు పోటీ పడుతున్నట్టు సమాచారం. కాగా విద్యుత్ శాఖకు సంబంధించి గతంలో అనంతపురం జిల్లాలో కీలక పోస్టులో పనిచేసి ఇపుడు తిరుపతిలో వుంటున్న రిటైర్డు అధికారి ఒకరు బదిలీల విషయంలో హవా నడుపుతున్నట్టు ఆరోపణలున్నాయి.సదరు రిటైర్డు అధికారి నిర్ణయం మేరకు ముఖ్యనేత సిఫారసు చేస్తున్నట్టు పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మొత్తం మీద తిరుపతిలో బదిలీల్లో ఎక్కువ మంది జోక్యం చేసుకుంటుండడంతో గందరగోళం నెలకొంటోంది.



కౌన్సిల్ హాల్లో బైఠాయించిన కౌన్సిలర్ వహీదా

మాటలతో మొదలై చేతలవరకూ.....

వెంకటగిరి మున్సిపల్ మీట్ రసాభాస

వెంకటగిరి, ఆగస్టు 31 : వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అత్యవసర సమావేశం రసాభాసగా మారింది.ప్రారంభంలోనే జాతర నిర్వహణపై చర్చ మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వంలో జాతర నిర్వహణకు మున్సిపల్ నిధులు ఖర్చు చేయలేదని, వైసీపీ ఇన్‌చార్జి రాంకుమార్ రెడ్డి నిధులతో జాతర నిర్వహించారంటూ 19వ వార్డు కౌన్సిలర్ వహీదా అనడంతో స్పందించిన 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్ లెక్కలు చూస్తే ఎవరెంత ఖర్చు చేశారో తెలుతుందన్నారు.వైసీపీ సింబల్‌తో కౌన్సిలర్‌గా గెలిచిన నీకు వైసీపీని విమర్శించే అర్హత ఎక్కడిదని వహీదా నిలదీస్తూ పరుష పదజాలం వినియోగించడంతో శేఖర్ టేబుల్‌పై వున్న వాటర్ బాటిల్‌ను ఆమెపైకి విసిరేశారు. దీంతో వహీదా తనకు న్యాయం చేయాలంటూ పోడియం వద్ద బైఠాయించింది. స్పందించిన ఛైర్‌పర్సన్ భానుప్రియ కౌన్సిలర్ నారిశేఖర్‌ను సమావేశం నుంచి సస్పెండ్ చేసి కౌన్సిల్ హాల్ విడిచి వెళ్లాలని ఆదేశించడం, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జోక్యంతో వివాదం సద్దుమణిగింది.వెంకటగిరి అభివృద్ధికి అటంకంగా పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టరు నక్కా వెంకటేశ్వరరావు తయారయ్యారని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆరోపించారు.ఆయన షాడో మున్సిపల్ ఛైర్మన్‌గా వ్యవహరించడం వల్ల అభివృద్ధి కుటుంబడిందని ఆరోపించారు. మొత్తం మీద జాతర నిర్వహణపై జరగాల్సిన సమావేశం కౌన్సిలర్ల ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికైంది.



వహీదాకు సర్ది చెబుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వర్షాల హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- ఆర్డీవోలతో జేసీ, డీఆర్వో వీడియో కాన్ఫరెన్స్
- ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

తిరుపతి(విద్య), ఆగస్టు 31:పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడం, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తిరుపతి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. విపత్తు నిర్వహణ సంస్థ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించింది.దీంతో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటయ్యాయి. కంట్రోల్‌రూముల్లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ ఆర్డీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడెక్కడ భారీ వర్షాలు కురిశాయని అధికారులను ఆరా తీశారు. ఐతే సముద్రతీర ప్రాంతాల్లోకూడా వర్షాలు కురవలేదని ఆర్డీవోలు తెలియజేశారు.అయినప్పటికీ జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తక్షణం స్పందించేలా సిద్ధంగా ఉండాలని జేసీ ఆదేశించారు.తహసీల్దార్లు కూడా అప్రమత్తంగా ఉంటూ, జిల్లా కేంద్రానికి సమాచారం తెలియజేస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లకు కాల్‌చేసి సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

కంట్రోల్‌రూమ్ నంబర్లు

తిరుపతి కలెక్టరేట్ 0877-2236007.
తిరుపతి ఆర్డీఓ కార్యాలయం : 8686966559
శ్రీకాళహస్తి : 9959322935 - సూళ్లూరుపేట:8897265235
గూడూరు : 08624-252807.

తిరుమలలో చిరుజల్లులు



చినుకుల కారణంగా నిర్మానుష్యమైన తిరుమల మాడవీధులు

తిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తిరుమల క్షేత్రంలోనూ కనిపించింది. శుక్రవారం సాయంత్రం నుంచే నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి.శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. చిన్నపాటి చినుకులే కావడంతో భక్తులు కూడా వర్షంలో తుడుస్తూనే దర్శనానికి వెళ్లడం, తిరిగి బయటకు రావడం కనిపించింది. కాలినడక భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే రాకపోకలు సాగించారు.తిరుమలలో చలి విపరీతంగా పెరిగింది. శ్రీవారి దర్శనార్థం వచ్చిన చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతూ కనిపించారు. ఘాట్‌రోడ్లలో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు జల్లులతో ఇబ్బందిపడ్డారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా వుండాలి



ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్)ఆగస్టు31:వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా వుండాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో కోరారు. సదరన్ డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించామని తెలిపారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో నోడల్ అధికారులు యుద్ధప్రాతిపదికన సరఫరా పునరుద్ధరణ పనులు చేపడతారని తెలిపారు.అనంతపురం సర్కిల్‌కు సీజీఎం వరకుమార్,నెల్లూరు సర్కిల్‌కు సీజీఎం ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్‌కు జనరల్ మేనేజరు సి.హెచ్.రామచంద్రరావు,కడప సర్కిల్‌కు జీఎం పి.మురళి, కర్నూలు సర్కిల్‌కు ఎస్.కె.ఇస్మాయిల్‌అహ్మద్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకరాదని, తడి చేతులతో స్విచ్‌లు వేయరాదని, విద్యుత్ లైన్ల కింద నిలుచోరాదని సూచించారు. విద్యుత్ తీగలు తెగడం,స్తంభాలు కూలిపోయిన సమయంలో వెంటనే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.టోల్‌ఫ్రీ నెంబర్లు 1912 లేదా 18004251555333కు కాల్ చేసి సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే 9133331912 నెంబరుకు విద్యుత్ సరఫరా అంతరాయాల సమాచారాన్ని చాటింగ్ చేయాలని కోరారు.



ఎర్రావారిపాళెం మండలం మేదరపల్లెలో లబ్ధిదారుకు పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

97.01 శాతం పింఛన్ల పంపిణీ

- రాత్రి 7 గంటల సమయానికి 2,59,101 మందికి అందజేత
- రెండో స్థానంలో జిల్లా

తిరుపతి(విద్య), ఆగస్టు 31: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తొలిరోజునే 97.01 శాతం పంపిణీ పూర్తయ్యింది. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం రావడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని సీఎం చంద్రబాబు ఒక రోజు ముందుగానే శనివారమే పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ ప్రారంభించి, తొలిరోజునే వంద శాతం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి కలెక్టర్ స్వయంగా నగరంలోని పలు ప్రాంతాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.లబ్ధిదారులతో మాట్లాడి, సమస్యలేమైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు.చంద్రగిరి,తిరుపతి,గూడూరు,వెంకటగిరి,సూళ్లూరుపేట,సత్యవేడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు,కూటమి పార్టీల నేతలు పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బందితో కలసి పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా 2,67,089 మంది లబ్ధిదారులుండగా.. శనివారం రాత్రి ఏడు గంటల సమయానికి 2,59,101 మంది (97.01 శాతం)కి పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు.

డ్రగ్స్ ఫ్రీ తిరుపతి

- అవగాహన ర్యాలీలో గొంతెత్తిన విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 31: డ్రగ్స్ ఫ్రీ ఇండియా.. డ్రగ్స్ ఫ్రీ ఏపీ.. డ్రగ్స్ ఫ్రీ తిరుపతి.. డ్రగ్స్ ఫ్రీ యూనివర్సిటీ.. పేరుతో తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ విభాగం - తిరుపతి పోలీసు శాఖ సంయుక్తంగా మత్తు పదార్థాల వ్యతిరేకంగా శనివారం ఎస్వీయూ పరిపాలనా భవనం నుంచి ఈ ర్యాలీ చేపట్టాయి. ఎన్టీఆర్ సర్కిల్ దాకా సాగిన ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు. ర్యాలీని ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. లేకుంటే తీవ్ర శిక్షలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. డ్రగ్స్‌పై 80999 99977 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రగ్స్ అనుమానిత ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్, నిఘా పెట్టామన్నారు. జిల్లాలో డ్రగ్స్‌ను సమూలంగా నివారించేందుకు పోలీసు శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. అయినా, డ్రగ్స్ నివారణకు విద్యార్థులు, ప్రజల సహకారం అవసరమని అన్నారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల మాయలో పడి యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. భవిష్యత్తులోనూ పోలీసు శాఖతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దామోదరం, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు